వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
VOICE OF PRAJALU
TGTEL/25/A2649
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
శుక్రవారం, ఫిబ్రవరి 27, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం... బైకర్ మృతి



తిరుమల పుణ్యక్షేత్రంలో విషాదం చోటుచేసుకుంది. శ్రీవారి దర్శనం ముగించుకుని తిరిగి వెళుతున్న ఇద్దరు భక్తులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని అరక్కోణం తాలుకా మిట్టపిట్టై గ్రామానికి చెందిన నటరాజన్, మునిరత్నం బైక్‌పై తిరుమల వచ్చారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి ఘాట్ రోడ్డులోని అత్యంత ప్రమాదకరమైన 30వ మలుపు వద్దకు రాగానే, అతివేగం కారణంగా వారి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పిట్టగోడను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర రక్తస్రావంతో నటరాజన్ ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు.

# పబ్లిక్ స్కూళ్లతో విద్యకు కొత్త బలం

ప్రతి నియోజకవర్గంలో టీపీఎస్ ఏర్పాటు ప్రతిపాదన

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సమగ్ర విద్యా నమూనా

12వ తరగతిలో మాత్రమే బోర్డు పరీక్షల సూచన

నర్సరీ నుంచే ఇంగ్లిష్ మాధ్యమం అమలు సిఫారసు

ఈఏపీ సెట్ రద్దు చేసి ఇంటర్ మార్కులతోనే ప్రవేశాలు




హైదరాబాద్: రాష్ట్ర విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దేందుకు ప్రతి నియోజకవర్గంలో అన్ని వసతులతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టీపీఎస్)ను స్థాపించాలని రాష్ట్ర విద్యా కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సుమారు 1,500 మంది విద్యార్థులకు సరిపడే విధంగా సమగ్ర విద్యా కేంద్రాలుగా ఈ పాఠశాలలను అభివృద్ధి చేయాలని నివేదికలో పేర్కొంది. విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేకంగా బస్సుల వ్యవస్థ

(మిగతా 2వ పేజీలో)



# ఘటనలు జరిగాక స్పందిస్తే ప్రయోజనం లేదు

అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి

ముందస్తు నివారణే ముఖ్యమని స్పష్టీకరణ

క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేసి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు సూచన

బాధితులకు అందుతున్న వైద్య సాయం, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీసిన సీఎం

శ్రీకాకుళం పట్టణంలో కలుషిత తాగునీటి కారణంగా డయేరియా ప్రబలడం, రాజమండ్రిలో కల్తీ పాల వల్ల పలువురు ప్రాణాలు కోల్పోవడం వంటి తీవ్రమైన ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మున్సిపల్, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ రెండు విషాద ఘటనల్లో ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏమాత్రం ఉపేక్షించవద్దని అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఘటన జరిగాక స్పందించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తత ద్వారా ఈ తరహా ఘటనలు

(మిగతా 2వ పేజీలో)

## మౌనిక, పాపపై దాడి జరిగినట్టు ఆధారాలు లేవు




కుమ్మెర ఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నాం

గ్రామ వాట్సప్ గ్రూప్‌లో పోస్టింగ్‌తో జాతరలో గణేశ్‌పై దాడి

నాగర్‌కర్నూల్‌లో కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్

## లొంగిపోవాలనుకున్న మావోయిస్టును హత్య చేసిన మావోయిస్టు నేత




తన అనుచరులతో కలిసి లొంగిపోవాలనుకున్న అన్వేష్ అలియాస్ రేణు

ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించిన మరో నేత సుక్రు

కుళ్లిపోయిన స్థితిలో అన్వేష్ మృతదేహం లభ్యం

## విమాన ప్రయాణికులకు గుడ్ న్యూస్.. టికెట్ రద్దుపై డీజీసీఏ కొత్త రూల్స్



విమాన టికెట్ బుక్ చేశాక 48 గంటల్లో ఫ్రీగా రద్దు లేదా మార్పు

దేశీయ ప్రయాణానికి 7 రోజులు, అంతర్జాతీయ ప్రయాణానికి 15 రోజుల ముందు వర్తింపు

విమానయాన సంస్థల వెబ్‌సైట్లలో బుక్ చేసిన టికెట్లకే ఈ సదుపాయం

టికెట్ రద్దు చేస్తే పన్నులు, ఇతర ఛార్జీల వాపసు తప్పనిసరి

# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

జాబితాలో 43 మంది ఐఏఎస్‌లు

మరో ఇద్దరు నాన్ ఐఏఎస్ అధికారులకు స్థానచలనం

కొంతమందికి అదనపు బాధ్యతలు

ఎస్ఐఆర్, జనగణన ముందే విస్తృత మార్పులు




హైదరాబాద్: రాష్ట్రంలో భారీ స్థాయిలో ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 43 మంది ఐఏఎస్‌లతో పాటు మరో ఇద్దరు నాన్ ఐఏఎస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (ఎస్ఐఆర్), జనగణన2027 కింద గృహాల గణన కార్యక్రమాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, బదిలీలపై నిషేధం అమల్లోకి రాకముందే ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఫార్ములా ఈకార్ రేసు కేసులో నిందితుడిగా ఉన్న విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌ను బాధ్యతల నుంచి తప్పించి కొత్త పోస్టింగ్ ఇవ్వలేదు. ఆ శాఖ అదనపు బాధ్యతలను

(మిగతా 2వ పేజీలో)



# ప్రతి పేదవాడికీ న్యాయం చేస్తాం

మీడియాతో మంత్రులు పొంగులేటి, పొన్నం, వివేక్

పేదల పక్షాన నిలిచే ప్రభుత్వమిదని స్పష్టం

వెలుగుమట్ల ఘటనపై ప్రతిపక్షంపై విమర్శలు

ఇంటి స్థలం, ఇళ్లు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతే

అసెంబ్లీలో చర్చకు రావాలని ప్రతిపక్షానికి పిలుపు

హైదరాబాద్: రాష్ట్రంలో జరిగిన ఎన్నికలన్నింటిలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన విషయాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. ఫామ్‌హౌస్ రాజకీయాలతో కుట్రలు చేస్తూ ప్రభుత్వం, సమాజంపై విష ప్రచారం చేస్తున్నారని

(మిగతా 2వ పేజీలో)

# ఇల్లు కూల్చడమే పాలనా?

వెలుగుమట్లలో పేదల ఇళ్ల కూల్చివేతపై కేటీఆర్ ఆగ్రహం

మంత్రుల విలాసాల కోసమే నిరాశ్రయులయ్యారన్న ఆరోపణ

నోటీసులు లేకుండా అర్ధరాత్రి చర్యలు చేపట్టారన్న విమర్శ

భూదాన్ పట్టాలు ఉన్నా అక్రమ కట్టడాల ముద్ర వేశారన్న ప్రశ్న

బాధితుల తరఫున న్యాయపోరాటం చేస్తామన్న భరోసా



ఖమ్మం : ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్లలో పేదల ఇళ్ల కూల్చివేతలపై రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తీవ్ర స్థాయిలో స్పందించారు. జిల్లాకు చెందిన మంత్రుల నిర్ణయాల వల్లే పేద కుటుంబాలు నిరాశ్రయులయ్యాయని ఆయన ఆరోపించారు. గురువారం వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించిన ఆయన, ముందుగా వినోభ (నవోదయ) కాలనీలో భూదాన్ ట్రస్ట్ భూమిని పరిశీలించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో ఆశ్రయం పొందుతున్న నిర్వాసితులతో మాట్లాడిన కేటీఆర్, ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ టుడే
జనగాత్రం - మనసేత్రం
శుక్రవారం, ఫిబ్రవరి 27, 2026

# ఘటనలు జరిగాక స్పందిస్తే ప్రయోజనం లేదు

జరగకుండా చూడాలి. శ్రీకాకుళంలో తాగునీరు కలుషితమైన ఘటనలో ముందస్తు తనిఖీలు జరిగి ఉంటే ఈ సమస్య వచ్చేదే కాదు“ అని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ప్రతి ప్రభుత్వ విభాగంలో కింది స్థాయి యంత్రాంగాన్ని క్రియాశీలం చేసేందుకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రతి అధికారి విధిగా పర్యటించాలన్నారు. ఒక్కో సందర్భంలో ఒక్కో శాఖపై ఆకస్మిక తనిఖీకి వెళ్లడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని, కిందిస్థాయి అధికారులతో పాటు సంబంధిత శాఖల్లో జవాబుదారీతనం పెరుగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. కలెక్టర్లు అంటే నిత్యం ప్రజల్లోనే ఉండాలని, అప్పుడే రాష్ట్ర స్థాయిలో అనుకున్న మార్పును తీసుకురాగలమని ఆయన పేర్కొన్నారు.

**శ్రీకాకుళంలో 107 మందికి చికిత్స: కలెక్టర్**

సమీక్షలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత పరిస్థితులను సీఎంకు వివరించారు. “జిల్లాలో ఇప్పటి వరకు 129 డయేరియా కేసులు నమోదు కాగా, ప్రస్తుతం 107 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 20 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పైపుల ద్వారా నీటి సరఫరాను నిలిపివేసి, ట్యాంకర్ల ద్వారా సురక్షితమైన నీటిని అందిస్తున్నాం. నాలుగు ఇంజనీరింగ్ బృందాలు 40 లీకులను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. 150 మంది సిబ్బంది, 7 జేసీబీలు, 10 ట్రాక్టర్లతో పారిశుద్ధ్య పనులు చేపట్టాం. విశాఖ నుంచి మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌ను తరలిస్తున్నాం. ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలూ పనిచేసేలా మెడికల్ క్యాంపులు, ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశాం” అని తెలిపారు. స్థానికులు వాటర్ ట్యాంకులు శుభ్రం చేసుకోకపోవడం, పైప్‌లైన్లు డ్రైన్లను క్రాస్ అవ్వడం, నీటి ప్రెజర్ లేకపోవడంతో మోటార్లు పెట్టి నీటిని తోడటం వల్ల కలుషిత నీరు ఇళ్లకు చేరిందని ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు వివరించారు.

**రాజమండ్రి ఘటనలో 8 మంది పరిస్థితి విషమం**

అనంతరం రాజమండ్రి కల్తీ పాల ఘటనపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



సీఎంకు వివరాలు అందించారు. “ఈ నెల 22న వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో 20 మంది అనారోగ్యం పాలుకాగా, ఐదుగురు మృతి చెందారు. మరో 15 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, వారిలో 8 మంది పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. ప్రభావిత ప్రాంతాల్లో 9 వైద్య బృందాలు పనిచేస్తున్నాయి. 957 మందిని నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాం. నిందితుడైన పాల సరఫరాదారు గణేశ్వరరావును అరెస్ట్ చేసి విచారిస్తున్నాం. బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ఇతర ప్రాంతాల నుంచి వైద్య నిపుణులను, పరికరాలను తెప్పించి మెరుగైన చికిత్స అందిస్తున్నాం” అని కలెక్టర్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారని అధికారులు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ ద్వారా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం, రాజమండ్రి ఎమ్మెల్యేలు, రెండు జిల్లాల ఎస్పీలు కూడా పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడికీ న్యాయం చేస్తాం

విమర్శించారు. కాళేశ్వరం అంశంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేసే నాయకులు దాచుకున్న సొమ్మును బయటకు తీసి పేదలకు ఇళ్లు కట్టిస్తే పాప పరిహారం జరుగుతుందని సూచించారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడిన మంత్రులు వెలుగుమట్ల ఇళ్ల కూల్చివేత అంశంపై స్పష్టత ఇచ్చారు. 2023 జూలై 15న అక్కడ జరిగిన కూల్చివేతలు అప్పటి ప్రభుత్వ హయాంలోనే జరిగాయని, హైకోర్టు ఉత్తర్వుల మేరకే అక్రమ నిర్మాణాలను తొలగించారని తెలిపారు. ఇల్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి అమలు చేయకుండా వదిలేసిందని గత ప్రభుత్వంపై ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని, పేదలే ఇందిరమ్మ ప్రభుత్వానికి పేటెంట్ అని వ్యాఖ్యానించారు. వెలుగుమట్లలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇంటి స్థలం, ఇళ్లు అందిస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఏ ఒక్క పేదవాడికి అన్యాయం జరగకుండా చూస్తామని, బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో జరిగిన అన్యాయాలను సరిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పేదల కష్టాలు తెలుసుకున్న నాయకత్వం జలయజ్ఞం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా రైతులకు సాగునీరు అందించాలనే దిశగా చర్యలు ప్రారంభించబడినట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారాల దిశగా అడుగులు వేయడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష నేతలు హాజరై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని మంత్రులు సూచించారు. తమ పాలనలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం తప్పకుండా ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వలేదని విమర్శిస్తూ, ఇప్పుడు సభలో నిర్మాణాత్మక చర్చలు జరగాలని కోరారు. నీటి ప్రాజెక్టుల విషయంలో ఉత్తర



తెలంగాణకు అన్యాయం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కాళేశ్వరం అంశంపై విచారణ ఎందుకు జరగడం లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ అవినీతి కారణంగానే ప్రతిపక్ష పార్టీ ఆర్థికంగా బలపడిందని విమర్శించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఎలక్టోరల్ బాండ్లు దీనికి నిదర్శనమని ఆరోపించారు. మొత్తానికి వెలుగుమట్లలో ఇల్లు కోల్పోయిన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయడం ప్రభుత్వ కర్తవ్యమని, ఇంటి స్థలం, గృహ నిర్మాణం ద్వారా వారి జీవన స్థితిని మెరుగుపరచడమే లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు. పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని, హామీలు తప్పకుండా అమలు చేస్తామని పునరుద్ఘాటించారు.

## మౌనిక, పాపపై దాడి జరిగినట్టు ఆధారాలు లేవు

### నాగర్‌కర్నూల్‌లో కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్

నాగర్‌కర్నూల్: కుమ్మెర మల్లన్న జాతరలో చోటుచేసుకున్న దాడి ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టామని నాగర్‌కర్నూల్ ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్ తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 18న జాతరలో దాడి జరిగిన సమయంలో డయల్100కు సమాచారం అందగానే పోలీసులు వెంటనే స్పందించినట్లు చెప్పారు. ముందుగా గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి తలకు గాయమైందని గణేశ్‌పై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై మరో కేసు నమోదు చేశామని తెలిపారు. ఘటన జరిగిన రోజు ఇచ్చిన ఫిర్యాదులో గణేశ్, చంద్రకళపై మాత్రమే దాడి జరిగినట్టు ప్రస్తావన ఉందని, మౌనిక, పాపపై దాడి జరిగినట్టు ఎలాంటి ప్రస్తావన లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ఘటన జరిగిన మూడు రోజుల తరువాత ఈ నెల 21న ఉదయం పాప మృతి చెందినట్లు చెప్పారు. పాపకు పోస్టుమార్టం నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించినట్లు తెలిపారు. ఈ నెల 17న జాతర సందర్భంగా తల్లి చంద్రకళను శ్రీనివాస్‌రెడ్డి దూషించాడని, దీనికి ప్రతిగా గ్రామ వాట్సప్ గ్రూప్‌లో శ్రీనివాస్‌రెడ్డిని విమర్శిస్తూ గణేశ్ ఆడియో పోస్టు చేసినట్లు వెల్లడించారు. గ్రూప్‌లో పోస్టు ఎందుకు చేశావంటూ ప్రశ్నిస్తూ శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరో ఎనిమిది మంది గణేశ్, చంద్రకళపై దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. దాడి ఘటనకు సంబంధించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి, ముగ్గురిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ తెలిపారు. మిగతా నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు. గత డిసెంబర్ 21న నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రిలో 1.44 కిలోల బరువుతో పాప జన్మించినట్లు తెలిపారు. శ్వాస సంబంధిత సమస్యల కారణంగా ఎన్ఐసీయూలో చికిత్స పొందిం దన్నారు. అనంతరం ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో సుమారు 30 రోజులపాటు చికిత్స అందించినట్లు చెప్పారు. రెస్పిరేటరీ సమస్యలు, జాండీస్, న్యూ మోనియా వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు వైద్యులు గుర్తించినట్లు తెలిపారు. పాప మృతికి సం బంధించి ఫోరెన్సిక్, విస్రా నివేదికలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. కుమ్మెర జాతరలో మౌనికతో పాటు ఆమె బిడ్డపై దాడి జరిగినట్టు ఆధారాలు ఇప్పటివరకు కనిపించలేదని స్పష్టం చేశారు. దాడి ఘటనలో బాధిత కుటుంబం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆరు రోజులుగా ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే గురువారం రాత్రి వారు దీక్షా శిబిరాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. టెంట్లు, వేదికను కూడా తొలగించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ స్పందిస్తూ, బాధిత కుటుంబం పోలీసులకు సమాచారం ఇవ్వకుండా కారులో వెళ్లిపోయిందన్నారు. బీసీ జేఏసీ నాయకులు సాయి, రఘు వారిని తీసుకెళ్లినట్లు సమాచారం ఉందని తెలిపారు.

## విమాన ప్రయాణికులకు గుడ్ న్యూస్.. టికెట్ రద్దుపై డీజీసీఏ కొత్త రూల్స్

విమాన ప్రయాణికులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) శుభవార్త చెప్పింది. టికెట్ రద్దు, రిఫండ్‌లకు సంబంధించి సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్ (సీఏఆర్)ను సవరిస్తూ కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. దీని ప్రకారం, ప్రయాణికులు టికెట్ బుక్ చేసిన 48 గంటల లోపు ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే టికెట్‌ను రద్దు చేసుకోవచ్చు లేదా మార్పులు చేసుకోవచ్చు. ఈ కొత్త నిబంధనలు మార్చి 26 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, ఈ ‘లుక్-ఇన్‘ పీరియడ్ సదుపాయానికి కొన్ని షరతులు వర్తిస్తాయి. దేశీయ విమాన ప్రయాణానికి కనీసం 7 రోజుల ముందు, అంతర్జాతీయ ప్రయాణానికి 15 రోజుల ముందు బుక్ చేసుకున్న టికెట్లకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది. కేవలం ఎయిర్‌లైన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా నేరుగా టికెట్లు బుక్ చేసుకున్న వారికే ఈ ప్రయోజనం అందుబాటులో ఉంటుంది. ఒకవేళ వేరే విమానానికి టికెట్ మార్చుకుంటే, ఛార్జీల వ్యత్యాసాన్ని ప్రయాణికులు చెల్లించాల్సి ఉంటుంది. 48 గంటలు దాటిన తర్వాత సాధారణ రద్దు ఛార్జీలు వర్తిస్తాయని డీజీసీఏ స్పష్టం చేసింది. టికెట్లపై పేరు తప్పుగా పడితే, బుక్ చేసిన 24 గంటల్లోపు తెలియజేస్తే ఎలాంటి రుసుము లేకుండా సరిచేసుకోవచ్చని తెలిపింది. ఇక రిఫండ్ల విషయంలోనూ డీజీసీఏ స్పష్టత ఇచ్చింది. ట్రావెల్ ఏజెంట్ల ద్వారా బుక్ చేసుకున్న టికెట్ల రిఫండ్ బాధ్యత కూడా విమానయాన సంస్థలదేనని, 14 రోజుల్లోగా ఆ మొత్తాన్ని వాపసు ఇవ్వాలని ఆదేశించింది. క్రెడిట్ కార్డ్ చెల్లింపుల రిఫండ్‌ను 7 రోజుల్లో, ఆఫీసులో నగదు చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలని పేర్కొంది. బేస్ ఫేర్ నాన్-రిఫండబుల్ అయినప్పటికీ, పన్నులు, ఇతర ఛార్జీలను తప్పనిసరిగా వాపసు ఇవ్వాలని స్పష్టం చేసింది.

### లొంగిపోవాలనుకున్న మావోయిస్టును

## హత్య చేసిన మావోయిస్టు నేత

ఒడిశా అడవుల్లో మావోయిస్టుల మధ్య చెలరేగిన అంతర్గత విభేదాలు ఒక కీలక నేత ప్రాణాలను బలిగొన్నాయి. తుపాకీ పట్టి విప్లవం బాటలో నడిచిన ఒక మావో కీలక నేత జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమవడమే ఆయన మరణానికి శాపమైంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టు నాయకుడు అన్వేష్ అలియాస్ రేణు, తన అనుచరులతో కలిసి పోలీసుల ముందు లొంగిపోయేందుకు సిద్ధమవగా, ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించిన మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత సుక్రు అతడిని అత్యంత దారుణంగా హతమార్చాడు. జనవరి 29న జరిగిన ఈ అడవి రక్తపాతం, పకారి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో అన్వేష్ కుళ్లిపోయిన మృతదేహం లభ్యమవడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... అన్వేష్ తలపై రూ. 22 లక్షల భారీ రివార్డు ఉంది. సుదీర్ఘ కాలం అజ్ఞాతంలో గడిపిన ఆయన, ఇటీవల తనతో పాటు మరికొందరు కమాండర్లను కలుపుకుని పోలీసులకు లొంగిపోవాలని నిశ్చయించుకున్నాడు. అయితే, ఈ ప్రతిపాదనను మరో మావోయిస్టు నేత సుక్రుతో పాటు అతడి ప్రధాన అనుచరులు సిలా, జగేష్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే దళం లోపల చెలరేగిన వాగ్వాదం చిలికి చిలికి గాలివానలా మారి, అన్వేష్ హత్యకు దారితీసింది. దారింగ్‌బాడి పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో దొరికిన మృతదేహం ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఈ విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఈ ఘటన మావోయిస్టు కేడర్‌లో నెలకొన్న తీవ్ర అసహనాన్ని, అంతర్గత విభేదాలను బట్టబయలు చేసింది. లొంగుబాటు నిర్ణయాలు తీసుకునే వారిని సొంత దళ సభ్యులే శత్రువులుగా చూస్తున్నారని ఈ ఉదంతం నిరూపిస్తోంది. ఇదిలా ఉండగా, అన్వేష్ హత్యలో పాలుపంచుకున్నట్లు భావిస్తున్న జగేష్ అనే మావోయిస్టు, ఇటీవల కంధమాల్ జిల్లాలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు పోలీసులు ధృవీకరించారు.




# పబ్లిక్ స్కూళ్లతో విద్యకు కొత్త బలం

ఉండాలని కూడా సిఫారసు చేసింది. ఈ మేరకు రూపొందించిన విద్యా విధాన పత్రాన్ని కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పించి, ముఖ్యాంశాలను మీడియా ముందు వెల్లడించారు. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించాలని కమిషన్ అభిప్రాయపడింది. మొదటి తరగతి నుంచే తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్, హిందీ భాషలను సమన్వయంగా బోధించే విధానాన్ని అమలు చేయాలని సూచించింది. చిన్న వయస్సు నుంచే ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన ఉండటం విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగకరమని నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం 6 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉన్న నిర్బంధ విద్య పరిమితిని 3 నుంచి 18 సంవత్సరాల వరకు విస్తరించాలని సిఫారసు చేసింది. అలాగే డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సును రద్దు చేసి, బి.ఎడ్‌ను ప్రాథమిక (నర్సరీ5వ తరగతి), ద్వితీయ (612వ తరగతి) స్థాయిలుగా విభజించాలని సూచించింది. విద్యార్థుల పోషణను దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్న భోజన పథకానికి కేటాయించే వ్యయాన్ని పెంచాలని, మెనూలో గుడ్డు మరియు అరటిపండు తప్పనిసరిగా చేర్చాలని తెలిపింది. పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు 12వ తరగతిలో మాత్రమే బోర్డు పరీక్షలు నిర్వహించాలని ప్రతిపాదించింది. ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించే ఈఏపీ సెట్‌ను రద్దు చేసి, ఇంటర్ మార్కుల ఆధారంగానే అడ్మిషన్లు ఇవ్వాలని సూచించింది. ప్రైవేట్ జూనియర్ కళాశాలల పేరిట జరుగుతున్న కోచింగ్ వ్యాపారాన్ని నిషేధించాల్సిన అవసరం ఉందని కూడా నివేదిక స్పష్టం చేసింది. ఉన్నత విద్యా రంగంలో ఖాళీగా ఉన్న సుమారు 72 శాతం రెగ్యులర్ అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కమిషన్ సూచించింది. పాఠశాలలు, కళాశాలల ప్రమాణాలను అంచనా వేయడానికి ‘తెలంగాణ ఎడ్యుకేషన్ స్టాండర్డ్స్ అథారిటీ’ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు చట్టబద్ధమైన నియంత్రణ కమిషన్ ఏర్పాటు అవసరమని పేర్కొంది. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 18 శాతం కేటాయించాలని సిఫారసు చేసింది. ఈ విద్యా విధానం అమలుకు ఏడేళ్ల రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిన కమిషన్, దాని ద్వారా సుమారు రెండు వేల పాఠశాలలను అభివృద్ధి చేయవచ్చని వివరించింది.

# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్‌కు అప్పగించారు. దేవాదాయ శాఖలో బదిలీల వ్యవహారంపై ఆరోపణలు రావడంతో ఆ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్. హరీశ్‌ను తప్పించారు. తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) ఎండీ జి. ఫణీంద్రారెడ్డిని నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ చేశారు. టీజీఎంఎస్ఐడీసీ ఎండీగా అదనపు బాధ్యతలను గౌరవ్ ఉప్పల్‌కు అప్పగించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్‌ను నియమించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శిగా ఎన్. శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శిగా ఈ. శ్రీధర్‌ను నియమించారు. తెలంగాణ భవన్ కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా బి. విజేంద్రను నియమించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా అద్వైత్‌కుమార్ సింగ్, యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్‌గా ఎం. హనుమంతరావు, నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా ఎం. సిక్తా పట్నాయక్‌ను నియమించారు. జనగామ జిల్లా కలెక్టర్‌గా రిజ్వాన్ బాషా షేక్, జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌గా సంతోష్ బీఎం, వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రతీక్ జైన్, హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా స్నేహ షబరీశ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇతర జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు, అదనపు కలెక్టర్లు, ప్రత్యేక కమిషనర్లు తదితర స్థాయిల్లోనూ విస్తృత మార్పులు చోటుచేసుకున్నాయి. కొంతమందికి అదనపు బాధ్యతలు అప్పగించగా, కొంతమందిని స్థానిక పరిపాలనా విభాగాలకు బదిలీ చేశారు. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా పి. కాత్యాయినిదేవిని నియమించగా, ఆ బాధ్యతలను తరువాత డి. దివ్యకు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిపాలనలో వేగం, సమన్వయం పెంపు లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. త్వరలో ప్రారంభమయ్యే ఎస్ఐఆర్, జనగణన కార్యక్రమాల దృష్ట్యా కీలక స్థానాల్లో అనుభవజ్ఞులైన అధికారులను నియమించినట్లు సమాచారం.

# ఇల్లు కూల్చడమే పాలనా?

పేదలను ఒక్కసారిగా రోడ్డున పడేయడం అన్యాయమని అన్నారు. భూదాన్ భూములు పేదలకు పంపిణీ చేయాల్సినవే కానీ, అదే భూమిలో నిర్మించుకున్న ఇళ్లను అక్రమ కట్టడాలంటూ కూల్చివేయడం దుర్మార్గమని విమర్శించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భూమిపై కన్నేసి ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. కూల్చివేతలు చేపట్టిన విధానంపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి పోలీసులతో కలిసి వచ్చి కనీసం సామగ్రి సర్దుకునే సమయం కూడా ఇవ్వకుండా ఇళ్లను కూల్చివేశారని పేర్కొన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కోర్టును ఆశ్రయించే అవకాశమూ కల్పించలేదని అన్నారు. దీని వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. 2014లో భూదాన్ ట్రస్ట్ ద్వారా వందలాది కుటుంబాలకు పట్టాలు జారీ అయ్యాయని, అప్పటి నుంచి అక్కడే నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. వారికి విద్యుత్ మీటర్లు, మున్సిపల్ ఇంటి నంబర్లు ఇచ్చిన ప్రభుత్వ వ్యవస్థ ఇప్పుడు అక్రమ కట్టడాలంటూ ఎలా చెబుతోందని ప్రశ్నించారు. తాను పట్టాలు, కోర్టు ఉత్తర్వులు పరిశీలించానని, అవి పేదలకు అనుకూలంగానే ఉన్నాయని చెప్పారు. బాధితులు తమ కష్టాలను వివరిస్తూ, సంవత్సరాల పాటు కష్టపడి సంపాదించిన సొమ్ముతో నిర్మించుకున్న ఇళ్లను కళ్లముందే కూల్చివేశారని వాపోయారని ఆయన తెలిపారు. కొందరు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఇటీవలే ఇళ్లు కట్టుకున్నప్పటికీ వాటిని కూడా నేలమట్టం చేశారని చెప్పారు. ఇళ్ల కూల్చివేతలతో విద్యార్థుల చదువులు, కుటుంబాల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూదాన్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారిపై అక్రమ కట్టడాల ముద్ర వేసి కూల్చివేసిన అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. బాధితుల తరఫున న్యాయస్థానంలో పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రస్తుతం కూల్చివేసిన ప్రదేశాల్లోనే మళ్లీ ఇళ్లు నిర్మించి ఇస్తామని భరోసా కల్పించారు. వెలుగుమట్ల కూల్చివేతలలో ప్రభుత్వం తప్పు చేయకపోతే సంబంధిత అధికారులను బదిలీ చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. తప్పు చేయలేదంటే మంత్రులు బాధితులను ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో చర్చించి పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

# వీర సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలి



## విహెచ్‌పీ నేత పగుడాకుల బాలస్వామి

హైదరాబాద్, ఫిబ్రవరి 26: వాయిస్ టుడే : దేశ స్వాతంత్ర ఉద్యమంలో వినాయక్ దామోదర్ సావర్కర్ త్యాగం అజరామరమని, ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి అన్నారు. సావర్కర్ ధైర్యం అసమానమని, బ్రిటిష్ ప్రభుత్వ తీరును తిరస్కరించి తిరుగుబాటు చేసిన మహోద్యమకారుడు అన్నారు. గురువారం సావర్కర్ 61వ వర్ధంతి సందర్భంగా కాచిగూడ చౌరస్తాలోని వీర సావర్కర్ విగ్రహానికి పూలమాలవేసి విశ్వహిందూ పరిషత్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ.. కొంతమందికి సావర్కర్ పేరు ఉంటే అసహనం పుట్టుకొస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో కొదమసింహాల్లా పోరాడిన వీరుల్లో వీరసావర్కర్ పోరాటపటిమ అగ్రస్థానంలో ఉంటుందని చెప్పారు. అలాంటి సావర్కర్ భారత జాతి సంపద అని చెప్పక తప్పదన్నారు. కానీ సావర్కర్ త్యాగాన్ని చిన్నదిగా చేసి చూపడం, ఆయన గౌరవాన్ని తగ్గించే కుట్ర చేసేందుకు నేడు కొంతమంది పోటీ పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినవారికి ఆకుల్లో , కాని వారికి కంచాల్లో.. వడ్డించినట్లు దేశ చరిత్రను కొంతమంది పక్షపాతంగా చరిత్రలోకి ఎక్కించారని విమర్శించారు. ఎవరు అవునన్నా కాదన్నా సావర్కర్ విప్లవానికి ప్రేరణ అన్నారు. "ప్రతి భారతీయుడిలో స్వాభిమానం, విప్లవ జ్వాలను రగిలించిన నిప్పురవ్వ" అని వివరించారు. ఆయన త్యాగం, అనుభవించిన చిత్రహింసలు, చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకం అని చెప్పారు. ధైర్యానికి నిలువెత్తు సాక్ష్యం అని, తల్లి భారతి వైభవం కోసం కాలాపాని జైలులో కాలరాత్రులు గడిపిన స్ఫూర్తి ప్రదాత పని సావర్కర్ సేవలను కొనియాడారు. స్వాభిమానం, స్వావలంబనలో జాతి వైభవానికి వెలుగు రేఖ సావర్కర్ అని చెప్పాను. అలాంటి మహనీయుడికి భారతరత్న అవార్డు ఇవ్వడం సముచితం అని బాలస్వామి స్పష్టం చేశారు. ఫిబ్రవరి 26వ తేదీన వీర సావర్కర్ వర్ధంతి సందర్భంగా భారత ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డును ప్రధానం చేసి, సావర్కర్ చరిత్ర నేటి సమాజానికి అందుబాటులోకి తీసుకురావడం తప్పనిసరి అని చెప్పారు. ఏది ఏమైనా నేటి తరం యువతకు, విద్యార్థులకు సావర్కర్ పోరాట పటిమ, దేశభక్తి, త్యాగానికి గుర్తుగా భారతరత్న ఇచ్చి సత్కరించాలని బాలస్వామి అన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు ఘనపురం రాఘవేంద్ర గౌడ్, అఖిలేష్, అనిల్, ధీరజ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



## పేద ప్రజలకు సామాజిక వర్గాలు అండగా నిలవాలి

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి...

### పద్మశాలి కళ్యాణ మండపం ప్రారంభోత్సవం...

సికింద్రాబాద్ ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే ప్రతినిధి): వెనుకబడిన వర్గాలను సామాజిక వర్గంలో ఉన్న పేద ప్రజలను ఆదుకునేందుకు ఆయా సామాజిక వర్గాలు అండగా నిలబడాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్పల్లి నెహ్రూ నగర్ లో రెనోవేషన్ చేసిన పద్మశాలి కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కిషన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పద్మశాలి సేవాసమితి ఆధ్వర్యంలో సమాజంలో పేద ప్రజలకు వృద్ధాప్య భవనాలు, విద్యార్థులకు హాస్టల్స్, స్కాలర్షిప్ లాంటి కార్యక్రమాలు పద్మశాలి సమాజానికి ఆదుకునేందుకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని, దానిలో భాగంగానే ఆధునిక హంగులతో కళ్యాణ మండపాన్ని పునర్నిర్మాణం చేసి పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.

## అవినీతి నీ అపలేమ ?

### ఎ.బి.వి.పి బషీర్బాగ్ నగర కార్యదర్శి సురేందర్...

సికింద్రాబాద్, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే ప్రతినిధి): అవినీతి ఆపలేమన్న నిజం, నేడు ప్రతి సామాన్యుడికి అనుభవంగా మారింది. కార్యాలయం నుంచి రాజకీయాల వరకు, ఫైలు కదలాలంటే లంచం తప్పనిసరి అన్న భావన సమాజంలో బలంగా పాతుకుపోయింది. చట్టాలు ఉన్నా అమలు బలహీనంగా ఉండటం వల్ల అవినీతి నిర్భయంగా రాజ్యమేలుతుంది. అధికారంలో ఉన్నవారు బాధ్యత మరిచి స్వార్థానికి పనిచేస్తే, సామాన్యుడు నిస్సహాయుడిగా మిగులుతున్నాడు. ఇది కేవలం వ్యవస్థ తప్పు మాత్రమే కాదు, మౌనంగా సహించేవారి తప్పు కూడా. అవినీతిని పూర్తిగా నిర్మూలించలేమనేది నిజమే కానీ, దానికి తలవంచి కూర్చోవడం మరింత పెద్ద నేరం. ప్రశ్నించే స్వరం తగ్గిపోవడం, "ఇలా అయితేనే పని అవుతుంది" అన్న ఆలోచన అవినీతిని బలపరుస్తోంది. యువత ముందుకు రావాలి, తప్పును ఎదుర్కొనే ధైర్యం చూపాలి. నిజాయితీగా పనిచేసే అధికారులు, పోరాడే పౌరులు కలిసి నిలబడితే అవినీతికి వణుకు పుడుతుంది. మార్పు పైనుంచి రావాలని ఎదురుచూడకుండా, ప్రతి ఒక్కరూ తన స్థాయి నుంచి పోరాటం మొదలుపెట్టాలి. అప్పుడే అవినీతిపై గెలుపు సాధ్యం అవుతుందని ఎ.బి.వి.పి బషీర్బాగ్ నగర కార్యదర్శి సురేందర్ పిలుపునిచ్చారు.

## దివంగత బాల ఆకాష్‌కు ఘన నివాళులు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ వద్దిరాజు సంతాపం -- కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా



భువనగిరి మైనారిటీ గురుకుల పాఠశాల సమీపంలో ఇటీవల మృతి చెందిన విద్యార్థి దివంగత బాల ఆకాష్ చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే . టీ . రామ రావు , రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర , మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి , బీఆర్ఎస్ నాయకులు =. ా. ప్రవీణ్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు బాల ఆకాష్ తల్లిదండ్రులు ఆంథోని రాజు, దీపికలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ విషాద ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిరుమర్తి లింగయ్య, దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## చలో నాగర్ కర్నూల్ విజయవంతం చేద్దాం...

### ఓయూ విద్యార్థి సంఘాలు..

సికింద్రాబాద్ ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే ప్రతినిధి): నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామం మల్లన్న గుడి దగ్గర జరిగిన అమానుష ఘటనను ఖండిస్తూ ఈనెల 28న ఐక్య విద్యార్థి సంఘాల ఆద్వర్యంలో నిర్వహిస్తున్న చలో నాగర్ కర్నూల్ కార్యక్రమాన్ని ప్రొఫెసర్లు, అన్ని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఏఐఓబిసిఎస్ఏ ప్రధాన కార్యదర్శి నూకల మధు యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు చలో నాగర్ కర్నూల్ గోడపత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల పసికందును అమానుషంగా గాయపరిచి చంపడం అత్యంత దారుణమని, బాధితులను కుల పరంగా దూషించడం, మహిళలపై కూడ విచక్షణ రహితంగా దాడి చేయడం అత్యంత దారుణమన్నారు.బాధితులు పిటిషన్ ఇచ్చినప్పిటికి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తిరిగి బాధితులపైనే పోలీసులు కేసులు పెట్టడం అన్యాయమని, రెండు నెలల పాప మరణానికి కారణమైన నిందులను అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న బాధిత కుటుంభాన్ని పరామర్శించిండానికి విద్యార్థులు అందరు పెద్ద ఎత్తున పాల్గోని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు యాదవ్, ఎంస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సోమశేఖర్, తెలంగాణ ఉద్యమకారులు కంచర్ల బద్రి, డివిఎఫ్ఐ ఉపాధ్యక్షుడు ఆర్ ఎల్ మూర్తి, జార్జ్‌రెడ్డి పిడిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, టిఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ ఎమ్ శ్రీకాంత్ యాదవ్, ఏఐఓబిసిఎస్ఏ ఓయూ ప్రెసిడెంట్ అరవింద్ గౌడ్,డిబిఎస్ఏ కార్యదర్శి దర్శన్,విజెఎస్ ఓయూ అధ్యక్షుడు కదారి రమేష్ యాదవ్, హంస ఓయూ ప్రెసిడెంట్ నామ సైదులు,బిసి ఉద్యమకారులు అవ్వారు వేణు,బిసి విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు చేరాల వంశి,ఎంబిసి ఫోరమ్ అశ్విణ్ కుమార్,నిరుద్యోగుల జేఏసి కాశి విద్యార్థులు వీరు నాయక్,రాజశేఖర్,ప్రశాంత్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## కుమ్మెర ఘటనలో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

### గ్రేటర్ హైదరాబాద్ బీసీ సంఘం అధ్యక్షులు మేడలా అభిలాష్ గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 26: వాయిస్ టుడే బీ కుమ్మెర ఘటనలో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని గ్రేటర్ హైదరాబాద్ బీసీ సంఘం అధ్యక్షులు మేడలా అభిలాష్ గౌడ్ డిమాండ్ చేశారు. మేడలా అభిలాష్ మాట్లాడుతూ అగ్రకుల అహంకారంతో బీసీ దళిత కుటుంబానికి చెందిన వారిపై అమానుషంగా దాడి చేసి పసికందు మరణానికి కారణమైన వాళ్లపై హత్యకేసుతో పాటు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు నమోదు చేయాలని అన్నారు. రాష్ట్రంలో కుల దురంకార హత్యలు జరగకుండా బీసీ ఎస్సీ ఎస్టీలపై భౌతిక దాడులు భవిష్యత్తులో జరగకుండా నివారించాలంటే కుమ్మెర నిందితులను కఠినంగా శిక్షించాలని మేడలా అభిలాష్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కంచి గారి ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా కోటి రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించాలని అన్నారు. కుమ్మెర కేసు ఘటనలో సంబంధం ఉన్న అందరనీ ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని ప్రవీణ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. బీసీ రజక కుటుంబానికి న్యాయం జరిగే వరకూ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర బీసీ సంఘం పోరాడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ బీసీ యువజన సంఘం అధ్యక్షులు విశాల్ మోహన్ పటేల్ పాల్గొన్నారు.

## పసిపాప మృతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి

### జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్



కాచిగూడ, ఫిబ్రవరి 26: ఇటీవల నాగర్ కర్నూల్ లో జరిగిన అత్యంత విషాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి పసిపాప కుటుంబానికి రూ. ఒక కోటి ఎక్స్ గ్రెసియా ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇవ్వాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ జాతరలో 2 నెలల పసిపాప మృతి చెందడం రాష్ట్ర చర్చనీయాంశమైందని, అయినప్పటికీ ప్రభుత్వానికి చీమ కుట్టి నట్లుగా లేదని ధ్వజమెత్తారు. మల్లన్న జారతకు సరియైన పోలీసుల భద్రత లేకపోవడంతోనే ఈ సంఘటన జరిగిందని ఆరోపించారు. అభం, శుభం తెలియని 2 నెలల పసిపాప మృతి జరిగి రోజులు గడుస్తున్నప్పటికీ నిందితులపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని, పసిపాప మృతికి బాధ్యులైన వ్యక్తులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## విధులకు వెళుతున్నట్లు చెప్పి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



సికింద్రాబాద్ (వాయిస్ టుడే): ఉస్మానియా విశ్వవిద్యాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. మాణికేశ్వరీనగర్ చెందిన యు. ప్రశాంత్ (29) ఓయూ క్యాంపస్లోని గంగా హాస్టల్లో వంటమనిషిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న విధులకు వెళుతున్నట్లు భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తరువాత తన సొంత గ్రామానికి పనిమీద వెళుతున్నాని ఫోన్లో తెలిపి కాల్ కట్చేశాడు. అనంతరం ఆయన భార్య రేణుక పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ, అతని మొబైల్ ఫోన్ స్విచ్ఎఫ్ వచ్చింది. దీంతో ఆమె బంధువుతో, పరిచయస్తులతో విచారించినా ఎలాంటి సమాచారం లభించకపోవడంతో ఆమె ఉస్మానియా విశ్వవిద్యాలయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మిస్సింగ్ కేసుగా దర్యాప్తు చేస్తున్నారు.

## ఠాగూర్ ఆడిటోరియంలో స్వీపింగ్ పనికి వెళ్లిన మహిళ అదృశ్యం..



సికింద్రాబాద్ (వాయిస్ టుడే): ఉస్మానియా విశ్వవిద్యాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ జయచందర్ వివరాల ప్రకారం ఓయూ క్యాంపస్లోని వీసీ లాడ్జ్ బస్తీకి చెందిన పి.లత (30) ఠాగూర్ ఆడిటోరియంలో తాత్కాలికంగా స్వీపింగ్ పని చేస్తోంది. ఈ నెల 18న ఆమెకు ప్రశాంత్ అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్ రావడంతో భర్త మల్లికాంత్ అనుమానం వ్యక్తం చేశాడు. 19న ఉదయం పనికి వెళ్ళిన లత తిరిగి ఇంటికి రాలేదు. ఆడిటోరియం పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త ఉస్మానియా విశ్వవిద్యాలయం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలిసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## వేడుకగా రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ కుమార్తె వివాహం

### హైదరాబాద్‌లో ఘనంగా శ్రేయ--పృధ్వి వివాహ మహోత్సవం

హైదరాబాద్, ఫిబ్రవరి 26: రాజస్థాన్ హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ మున్నూరు లక్ష్మణ్ -- మధుమతి మున్నూరు దంపతుల కుమార్తె శ్రేయ వివాహం కీ.శే. కంఠం విశ్వేశ్వర రావు -- వాణిశ్రీ దంపతుల కుమారుడు పృధ్వితో గురువారం హైదరాబాద్‌లోని ది అడ్రస్ కన్వెన్షన్ అండ్ ఎక్సిహిబిషన్స్ లో వైభవంగా జరిగింది. వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, మున్నూరుకాపు కుల సంఘాల ప్రతినిధులు, కుల ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ కాసుల వినోద్, కుటుంబ సభ్యులు, కొండూరు వినోద్ కుమార్, బంధుమిత్రులు తదితరులు పాల్గొని వధూవరులకు ఆశీస్సులు అందించారు. ఆనందోత్సాహ వాతావరణంలో సాంప్రదాయ పద్ధతిలో జరిగిన ఈ వివాహ వేడుక అందరినీ ఆకట్టుకుంది.



# భువనగిరి మున్సిపాలిటీని రాష్ట్రంలో ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

**- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. (వాయిస్ టుడే ప్రతినిధి):– కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే పలు సంక్షేమ పథకాలను భువనగిరి పట్టణ కౌన్సిలర్లంతా ప్రజల్లోకి తీసుకెళ్లి..భువనగిరి మున్సిపల్ ను రాష్ట్రంలో ఆదర్శవంతమైన మున్సిపల్ కౌన్సిల్ గా తీర్చిదిద్దేందుకు కౌన్సిల్ సభ్యులు ఉండాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నూతన మున్సిపల్ కౌన్సిలర్లకు సూచించారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ల పదవీ బాధ్యత స్వీకరణోత్సవ కార్యక్రమానికి గురువారం వారిరువురూ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి..ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు సంయుక్తంగా మాట్లాడుతూ అధికార పార్టీ కౌన్సిలర్ లు అంతా ఐక్యతతో ఉండి ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్ల అండదండలతో.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే అభివృద్ధి పథకాలను పట్టణంలోని అన్ని కాలనీలకు తీసుకెళ్లి ప్రజా అభివృద్ధి చేయడమే మీ వంతు కర్తవ్యమని వారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా అభివృద్ధి తమ ధ్యేయంగా..ప్రజా సంక్షేమమే తమ లక్ష్యంగా పెట్టుకుని,మహిళలకు పెద్దపీట వేసిందని,రాష్ట్రంలో మహిళందరికి ఉచిత బస్సు ప్రయాణం,అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని వారన్నారు. రేషన్ కార్డు ప్రతి పేదవారికి అవసరమని,

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాకనే, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అంచలవారిగా అందజేసిన ఘనత ప్రభుత్వానికి దక్కిందన్నారు. మహిళలకు ఆత్మ గౌరవం పెంచే విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ పెద్దపీట వేస్తున్నామని, అలాగే మహిళలందరినీ కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని, అలాంటి పథకాలు ప్రతి నిరుపేద బిడ్డకు అందాలని వారు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రతి నిరుపేద బిడ్డకు అందించి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని,ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి పట్టణానికి తీసుకెళ్లేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంభం కీర్తి రెడ్డి, భువనగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



## భువనగిరి పట్టణ ప్రజల అభివృద్ధే తన ధ్యేయం... నిరంతరం వారి సేవలో నేనుంటా

**– భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్**

**భువనగిరి పట్టణ ప్రజలకు తాను ఎంతో రుణపడి ఉన్నాను..**
**భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్**

భువనగిరి పట్టణ ప్రజలు తనను ఏ నమ్మకంతో నైతే తనను మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నుకున్నందులకు, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన వంతు కర్తవ్యంగా నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై.. పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని.. నూతనంగా ఎన్నికై గురువారం చైర్ పర్సన్ పదవిని అలంకరించిన భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ లు అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సహచర కౌన్సిలర్లు 34 మంది సహకారం.సూచనలతో..ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను పట్టణంలోని అన్ని కాలనీలకు అందజేసి,పట్టణ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. పట్టణములో ఏ కాలనీలోనైనా ఎలాంటి సమస్య ఉన్న..తనకు ఫోన్ కాల్ చేస్తే చాలు అని.. తమ గుమ్మం ముందు నేను ఉంటానని..మీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె వివరించారు. భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి,ప్రభుత్వ విప్పు బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ల సహకారంతో ముందుకు వెళ్తానని ఆమె తెలిపారు. పట్టణ ప్రజలకు, ఆయా పార్టీల ముఖ్య నాయకులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,తాను ఎంతో కృతార్థుడనని, వారికి తాను ఎంతో రుణపడి ఉంటానని ఈ సందర్భంగా బోనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్లు పేర్కొన్నారు.



## భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన " చెల్లెమ్మ.. తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్‌లకు" అన్నయ్య దేవరకొండ నరసింహచారి" కృతజ్ఞతలు

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో..( వాయిస్ టుడే ప్రతినిధి):– భువనగిరి పురపాలక సంఘం చైర్ పర్సన్ గా గురువారం "తంగళ్ళపల్లి శ్రీ వాణి చెల్లెమ్మకు.." మాజీ కౌన్సిలర్ జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం అధ్యక్షుడైన... అన్నయ్య..."దేవరకొండ నర్సింహ చారి " ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అన్నయ్య నర్సింహ చారి మాట్లాడుతూ కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆశీర్వాదం, ఎంపీ సామల కిరణ్ కుమార్ రెడ్డి సహకారం, జిల్లా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అండదండలు, ప్రభుత్వ విప్పు బీర్ల ఐలయ్య సూచనలు, 35 వ వార్డు ప్రజల సహకారం తో చైర్ పర్సన్ పదవి అందుకున్న తంగళ్ళపల్లి శ్రీ వాణి.. 34 వార్డుల కౌన్సిలర్లు,పట్టణ ప్రజల సహకారంతో భువనగిరి పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని అటు ప్రజలను, ఇటు ప్రజాప్రతినిధులను ఏకం చేసి తగు సూచనలు సలహాలతో అభివృద్ధి కి కృషి చేసేందుకు " మా చెల్లెమ్మ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ కు ఉందని "భువనగిరి పట్టణంలోని ఉమ్మడి జిల్లా మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ప్రభుత్వ విప్పు.. బీర్ల ఐలయ్య,ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ,ఆయా పార్టీల రాజకీయ నాయకులు, ప్రజలు మీ వెంట ఉన్నారని వారి సలహాల మేరకు భువనగిరి పట్టణాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాలని" చెల్లెమ్మకు.. అన్నయ్య "సూచనలు ఇచ్చి.. రెండు చేతులెత్తి నమస్కారం తో అభివాదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మరుకుక్కుల శ్రీనివాస్, కుంచం రాజు, మహంకాళి సురేష్, మహేష్, నమోజు రాజు,సురేష్, కానుగంటి ప్రేమ్ కుమార్, విశాల్, కోడెం రమేష్, కరుణాకర్,నరహరిలతో పాల్గొని అభివృద్ధి కి..కేరాఫ్ శ్రీ వాణి రవి కుమార్ లు అని.. వీరి హయాంలో భువనగిరి పట్టణం అభివృద్ధి వైపు పయనిస్తూ రాష్ట్రంలో నెంబర్వన్ మున్సిపాలిటీగా పురోగతి సాధిస్తుందని అన్నయ్య దేవరకొండ నరసింహ చారి తన విశ్వాసంను వ్యక్తం చేశారు.

## హనుమకొండ జిల్లా కోర్టులో బాంబు వార్త కలకలం

**రంగంలోకి దిగిన బాబ్ స్క్వాడ్..ముమ్మర తనిఖీలు**

**అనంతరం ఎలాంటి బాంబులేదని నిర్ధారణ.. ఊపిరి పీల్చుకున్న జనం**

**ఆకతాయిల పని.. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం: సిఐ రంజిత్**



హనుమకొండ (వాయిస్ టుడే): హనుమ కొండలోని వరంగల్ జిల్లా కోర్టు సముదాయంలో గురువారం బాంబు ఉందన్న వార్తతో ఒక్కసారిగా కలకలం రేపింది. కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు అజ్ఞాత వ్యక్తుల నుండి వచ్చిన ఈమెయిల్ బెదిరింపుతో న్యాయవాదులు,కోర్టు సిబ్బంది,సందర్శకులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. వివరాల్లోకివెళితే గురువారం మధ్యాహ్నం జిల్లా కోర్టు అధికారులకు ఒక బెదిరింపు ఈమెయిల్ అందింది. కోర్టు ఆవరణలో బాంబులు అమర్చామని..అవి ఏ క్షణమైనా పేలిపోతాయని ఆ సందేశంలో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన కోర్టు సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.

**సిఐ రంజిత్ ఆధ్వర్యంలో తనిఖీలు..**

సమాచారం అందుకున్న వెంటనే స్థానిక సుబేదారి సిఐ రంజిత్ ఆధ్వర్యంలో డాగ్,బాంబ్ స్క్వాడ్ సిబ్బంది మరియు ఫైర్ సిబ్బంది కోర్టుకు చేరుకు న్నారు. ఈ సందర్భంగా భద్రతా కారణాల దృష్ట్యా కోర్టు కార్యకలాపాలను నిలిపివేసి లోపల ఉన్న వారందరినీ పోలీసులు బయటకు పంపించివేశారు. రంగంలోకి దిగిన బాంబు డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్,డాగ్ స్క్వాడ్ సభ్యులు కోర్టు గదులు,రికార్డు రూములు, పార్కింగ్ ఏరియా,పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీచేశారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ తనిఖీలతో కోర్టు ప్రాంగణంలో ఒక రకమైన టెన్షన్ వాతావరణం నెలకొంది. చివరకు ఎక్కడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించకపోవడంతో అది 'ఉత్తుత్తి' బెదిరింపుగా పోలీసులు ధృవీకరించారు. దీంతో ఇటు పోలీసులు,అటు సామాన్య జనం ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న పోలీసులు ఈమెయిల్ ఎక్కడి నుండి వచ్చింది? పంపిన వ్యక్తి ఎవరు? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో విచారణ చేపట్టారు. నిందితులను తొందరలోనే పట్టుకుంటామని సిఐ రంజిత్ తెలియజేశారు.



## యాదాద్రిలో రధమహోత్సవం.. పోటెత్తిన భర్త జనం...

యాదగిరిగుట్ట (వాయిస్ టుడే):యాదాద్రి బ్రహ్మోత్సవాలు రంగ రంగ వైభవంగా జరిగాయి గురువారం రాత్రి స్వామి వారి దివ్య విమాన రథోత్సవం కన్నుల పండుగ సాగింది.. స్వామివారిని యాదాద్రి కొండపై తిరువీధుల్లో వేద పండితులు మంత్రాలతో సన్నాయి మేళం, బ్యాండ్ మేళాలతో స్వామివారిని ఊరేగించారు స్వామివారి హృదయ మహోత్సవాన్ని కలిగించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ గట్టి బందోబస్తు, సీసీ కెమెరాలతో ప్రతినిత్యం నిఘా చేస్తున్నట్లు పోలీసు వారు తెలిపారు. భక్తులకు సౌకర్యార్థం దేవస్థానం ఈవో భవాని శంకర్ అని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో భవాని శంకర్, అడిషనల్ఈఓ భాస్కర్, ఏ ఈఓ రఘు, ఆలయ పోలీస్ శాఖ ఎస్పీఎఫ్ అధికారులు శేషగిరిరావు, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ ప్రభు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా కె.వెంకారెడ్డి పదవీ బాధ్యతలు



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. (వాయిస్ టుడే ప్రతినిధి):– యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో కె.వెంకారెడ్డి గురువారం పదవి బాధ్యతలు స్వీక రించారు. ఆయన గతంలో శేరిలింగంపల్లిలో డిప్యూటీ కలెక్టర్, తహసిల్దార్ పనిచేస్తున్న వెంకారెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనురాగ్ జయంతి



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... (వాయిస్ టుడే ప్రతినిధి ):– యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ గా అనురాగ్ జయంతి గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. 2015 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన అనురాగ్ జయంతి గతంలో భోధన్ , ఖమ్మం జిల్లాలో సబ్ కలెక్టర్ గా,రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా, జి హెచ్ ఎం సి పరిధిలో ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ గా పని చేశారు. ప్రస్తుతం జిహెచ్ఎంసి రాజేంద్ర నగర్ లో జోనల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న అనురాగ్ జయంతి బదిలీ పై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టడం జరిగింది. విద్యా, వైద్య రంగాలతో పాటు అభివృద్ధి,సంక్షేమ ఫలాలు అట్టడుగు ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమగ్ర అభివృద్ధి దిశ గా జిల్లా ముందుకు సాగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.



**యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా అనురాగ్ జయంతి బాధ్యతలు స్వీకరించడానికి కలెక్టరేట్ కు వస్తున్న సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కరరావు నూతన కలెక్టర్‌కి మర్యాద పూర్వకంగా స్వాగతం పలుకుతున్న దృశ్యం.**

**– యాదాద్రి భువనగిరి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి)**

# ప్రకృతి రక్షించుకుందాం.. వైజ్ఞానిక దృక్పథం పెంపొందిద్దాం..రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

**- ప్రజాకవి జయరాజు,విజ్ఞాన దర్శిని వ్యవస్థాప అధ్యక్షులు రమేష్ పిలుపు**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... (వాయిస్ టుడే ప్రతినిధి):– వైజ్ఞానిక దృక్పథంతోనే మానవ ప్రగతి సాధ్యమని ప్రముఖ ప్రజాకవి డాక్టర్ జయరాజు, విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ తెలియజేశారు. గురువారం ప్రకృతి రక్షించుకుందాం మనే నినాదంతో విజ్ఞాన దర్శిని, నెహ్రూ సెంటర్, నేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రకృతి విజ్ఞాన యాత్ర భువనగిరి జిల్లా కేంద్రానికి రాగానే వివిధ ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, అభ్యుదయవాదులు, రచయితలు, అంబేద్కర్ వాదులు, ప్రకృతి ప్రేమికులు స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర వారి యొక్క విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభ కార్యక్రమాన్ని ఉద్దేశించి జయరాజు, రమేష్ మాట్లాడుతూ సమాజ మనుగడలో ప్రకృతి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈరోజు రోజురోజుకు ప్రకృతి మొత్తం కూడా ధ్వంసమై



ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మానవుని యొక్క అభివృద్ధిలో కీలకపాత్ర సైన్స్ పోషిస్తుందని తెలియజేశారు. యువతి యువకులు శాస్త్రీయ పరమైన దృక్పథాన్ని అలవర్చుకోవాలని కోరారు. ప్రకృతిని కాపాడుకొని వైజ్ఞానిక దృక్పథం పెంపొందించు కోవాలని పిలుపునిచ్చారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి మానవునికి స్వేచ్ఛగా జీవించే హక్కు, భూమి, పకృతి , సంపద కుందే హక్కును రాజ్యాంగాన్ని కల్పించిందని అన్నారు. ఈరోజు పాలకులు ప్రజలను మభ్య పెట్టడానికి పెట్టడానికి మూఢత్వాలను ముందుకు తెస్తున్నారని అన్నారు. వీటికి వ్యతిరేకంగా భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముక్కెర్ల యాదయ్య అధ్యక్షత వహించగా వివిధ ప్రజా సంఘాల నాయకులు బట్టు రామచంద్రయ్య, బర్రె సుదర్శన్, సామ మల్లారెడ్డి, శ్రీనివాస చారి, జిట్ట భాస్కర్ రెడ్డి, కొండారి వెంకటేష్, భాస్కర్ నాయక్, రాజేష్ నాయక్, కొండమడుగు నరసింహ, మాటూరు బాలరాజు, దాసరి పాండు, మాయ కృష్ణ, లావుడియా రాజు, బొల్లు యాదగిరి, గడ్డం వెంకటేష్,ఈర్ల పల్లి ముత్యాలు, వనం ఉపేందర్, గంధమల్ల మాతయ్య, సిహెచ్. లక్ష్మి, కొండమడుగు నాగమణి, రాహుల్, బాలయ్య, మల్లేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# బురదజల్లడం బీఆర్ఎస్ దిగజారుడుతనానికి నిదర్శనం




**తనపై అసత్య ప్రచారాలు చేస్తూ కించపరచడం తగదు**

**లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి తీసుకోలేదు..ఆధారాలు ఉంటే నిరూపించాలి**

**అభివృద్ధి పనుల వివరాలను ప్రజల ముందుంచేందుకు సిద్ధం**

**పార్టీల భేదం లేకుండా ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేశాం**

కాజీపేట,వాయిస్ టుడే: ప్రభుత్వం,అధికార పార్టీ నాయకులపై బురదజల్లడం బీఆర్ఎస్ నాయకుల దిగజారుడుతనానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ నాయకులు మైసారపు సిరిల్ లారెన్స్ అన్నారు. గురువారం కాజీపేట మీడియా పాయింట్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మైసారపు సిరిల్ లారెన్స్ ఆధ్వర్యంలో 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్ అధ్యక్షత విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి,సంక్షేమ పథకాలపై చేసిన ఆరోపణలకు సిరిల్ లారెన్స్ ఘాటుగా స్పందించారు. తనపై అసత్య ప్రచారం చేస్తూ కించపరిచే విధంగా మాట్లాడటం తగదని మండిపడ్డారు. అభివృద్ధి లేదా సంక్షేమ పథకాల అమలులో తాను ఎలాంటి లాభాపేక్ష పొందలేదని..ఎవరైనా లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి అయినా తీసుకున్నట్లు ఆధారాలు ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. బూడిదగడ్డలో వరద బాధితులకు ప్రభుత్వం అందించిన సహాయాన్ని మధ్యవర్తులుగా నిలిచి బాధితులకు చేరవేసినట్టు తెలిపారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదని,కేవలం పార్టీ కార్యకర్తలకు మాత్రమే సహాయం అందించినట్లు చెప్పడం అసత్యమని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండున్నర సంవత్సరాల్లో బాపూజీనగర్,బూడిదగడ్డ తదితర ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజల ముందుంచేందుకు ఎప్పుడూ సిద్ధమని తెలిపారు. 47వ డివిజన్‌లో వరద ముంపు బాధితులైన 69 మందికి ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో 15 వేల రూపాయలు జమ చేసిందని చెప్పారు. ఇందులో పార్టీ తారతమ్యాలు చూడలేదని స్పష్టం చేశారు. అలాగే 47వ డివిజన్‌లో 126 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని,ప్రొసీడింగ్ ప్రతులు అందజేశామని తెలిపారు. ఇప్పటివరకు 76 మంది ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారని చెప్పారు. ఈ లబ్ధిదారుల్లో బీజేపీ,బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఉన్నారని,అర్హులైన వారందరికీ పార్టీ భేదం లేకుండా ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. అదే విధంగా రేషన్ కార్డులు లేని వారికి వెయ్యికి పైగా కొత్త కార్డులు జారీ చేసినట్టు తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్, సిపిఐ, తెలుగుదేశం తదితర పార్టీలకు చెందిన వారందరినీ సమానంగా చూసామని..ఈ విషయాన్ని విస్మరించి ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఇప్ప శ్రీకాంత్ మాయసారపు సిరిల్ లారెన్స్,47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అస్గర్,యూత్ అధ్యక్షుడు కాలేశ్వరం వంశీనాథ్,మాజీ అధ్యక్షుడు దొంగల కుమార్ యాదవ్,మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు,బొబ్బిలి నాగరాజు,నీలం భానుచందర్, మైనార్టీ జనరల్ సెక్రటరీ ఎండి బిలాల్,బర్ల రాజ్ కుమార్, పోగుల శ్రీనివాస్,దార్ల రాజ్ కుమార్,మాతంగి స్వామి, ఇమ్మడి రవి,సిరిపాక కుమార్,జానపట్ల యాదగిరి, గాజుల లక్ష్మణ్,డి.సి. మౌళి,ఎనగందుల మాలతి,సోంపల్లి అమృత,కాళేశ్వరం రేణుక తదితరులు పాల్గొన్నారు.



## చిన్నన్న, పెద్దన్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

కోనరావుపేట, ఫిబ్రవరి 26( వాయిస్ టుడే): కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి గ్రామంలో అత్యంత పురాతన దేవాలయం అయిన చిన్నన్న, పెద్దన్న ఆలయంలో శ్రీ మల్లీఖార్జున, వీరభద్ర స్వామి, నల్ల పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాన, కల్యాణమహోత్సవాలను ఆలయ కమిటీ, గ్రామపంచాయతీ అధ్వర్యంలో అత్యంత వైభంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారి విగ్రహాలను వేదాపండితుల మంత్రోచ్చరణాలతో పాటు ఒగ్గు పూజారుల ఆటపాటలతో పూజలు చేసి హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ఆరె కుల యూత్ సభ్యులు అన్నదానం కార్యక్రమాన్ని చేయగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇక్కడ సర్పంచ్ పన్నాల లక్ష?ష్మారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తక్కళ్ల ఎల్లారెడ్డి, ఆదర్శ సొసైటీ చైర్మన్ ముత్యాల కిషన్‌రెడ్డి, ఉపసర్పంచ్ కాసర్ల పవిత్ర, కార్యదర్శి ముదాం సతీష్, మాజీ సర్పంచ్ కొక్కుల భారత, పన్నాల విజయ, మాజీ ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

జమ్మికుంట ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): జమ్మికుంట కృషివిజ్ఞాన కేంద్రం ప్రకృతివ్యవసాయం ప్రాజెక్టులో భాగంగా గురువారం కనగర్తి గ్రామంలో బీ ఆర్ సి రైతు గూడా కనకయ్య బీ ఆర్ సి వద్ద బీ ఆర్ సి ఇన్చార్జ్ మురళీధర్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంలో వచ్చే మోగిపురుగు, పచ్చపురుగు, తాటిఆకుతెగుళ్లు, అగ్గితెగులు, పాముపొడ తెగుళ్లు, ఎలా నివారించుకోవాలో వారికి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో నీమాస్త్రం, జీవామృతం, పుల్లటి మజ్జిగ వాటి ఉపయోగాలు, పనిచేసే విధానం పురుగుల పైన తెగుళ్లపైన పనిచేసే విధానం గురించి రైతులకు తెలిపారు. ప్రత్యక్షంగా అగ్నిఅస్త్రం తయారుచేసి రైతులకు చూపించారు. తక్కువ ఖర్చు తో పురుగులు, తెగుళ్లను ఎలా అరికట్టాలో చెప్పారు. భూమి ఆరోగ్యం , మానవాళి ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఫెసిలేటర్స్ ఆకేంద్ర, మమత, కిరణ్ సుమారుగా 30 మంది రైతులు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

**విస్డం స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్సై పృథ్వీధర్ గౌడ్**



చిగురుమామిడి, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చిగురుమామిడి ఎస్సై పృథ్వీధర్ గౌడ్ హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలోని విస్డం ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.డిఫెన్సివ్ డ్రైవింగ్‌లో భాగంగా నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో రోడ్డు ప్రమాదాల కారణాలు, వాటి నివారణ చర్యలపై ఎస్సై వివరించారు. చిన్న పిల్లలు లేదా మేజర్ కాని వారు వాహనాలు నడిపినట్లయితే, వారికి వాహనాలు అందజేసిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయబడతాయని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు.

'డ్రంక్ అండ్ డ్రైవ్' అంటే మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని, అలాంటి చర్యలకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి జీవితంతో ముడిపడి ఉందని, ఒక్క నిర్లక్ష్యం అనేక కుటుంబాలకు శోకాన్ని మిగుల్చుతుందని తెలిపారు. విద్యార్థులు మంచి ప్రవర్తనను అలవర్చుకుని, క్రమశిక్షణతో చదువుకుంటూ, నిత్యం వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరమని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మోర సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రశంసలు అందుకుంది.



## కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్

**మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు, జర్నలిస్టులు**

హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్ గా చాహత్ బాజ్ పాయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్ ను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి,జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్డీవోలు రాథోడ్ రమేష్,డాక్టర్ కన్నం నారాయణ,పలువురు జిల్లా అధికారులు,తహసిల్దార్లు నూతన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు,పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి అదనపు కలెక్టర్,అధికారులు ఘనంగా స్వాగతం పలికి పూల మొక్కలు పుష్పగుచ్చాలను అందించారు. జిల్లా కలెక్టర్ గా కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పని చేసిన స్నేహ శబరిష్ బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు కలెక్టర్ గా వెళ్ళగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా ఉన్న చాహత్ బాజ్ పాయ్ హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.

**కలెక్టర్‌ను కలిసిన గడ్డం కేశవమూర్తి..**

హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ని గ్రేటర్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పుష్పగుచ్చం అందజేసిన గడ్డం కేశవ్ మూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా పూర్తి స్థాయి కలెక్టర్‌గా గరీమ అగ్రవాల్



సిరిసిల్ల; ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా పూర్తి స్థాయి కలెక్టర్ గా గరీమ అగ్రవాల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సాధారణ పరిపాలన విభాగం జీవో ఆర్టీ నంబర్ 290 ద్వారా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 2019 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారిణి అయిన గరీమ అగర్వాల్, ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గా (స్థానిక సంస్థలు) విధుల ను నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా ఆమె జిల్లా ఇంచార్జి కలెక్టర్ గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, ప్రభుత్వం ఇప్పుడు ఆమె ను పూర్తిస్థాయి కలెక్టర్ గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇంచార్జి కలెక్టర్ గా జిల్లా లోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం లో ఆమె చురుకైన పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు పూర్తి స్థాయి బాధ్యత లు చేపట్టనుండటం తో జిల్లా మరింత ప్రగతి పథం లో పయని స్తుందని భావిస్తున్నారు. జిల్లా యంత్రాంగం పై ఇప్పటికే మంచి పట్టున్న గరీమ అగర్వాల్ నియామకం పట్ల స్థానిక అధికారులు, ప్రజల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది.




## హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి.**

**హెల్త్ క్యాంప్‌లో నిపుణుల సూచనలు**

సిరిసిల్ల; ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని సిరిసిల్ల పట్టణం లో హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో రాజీవ్ నగర్ లోని చేనేత సహకార సంఘం లోని కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్ మెడికవర్ హాస్పిటల్ వైద్య బృందం సౌజన్యం తో ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ క్యాంప్‌లో డాక్టర్ విద్యాప్రకాశ్ పాల్గొని సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, షుగర్, బరువు, హీమోగ్లోబిన్, ఇ.సి.జీ. వంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సూచనలు అందించారు. వైద్యులు కార్మికులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిపుణులు పలు సూచనలు చేశారు. ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలనీ తెలిపారు.పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శరీరానికి కావలసిన పోషకాలు అందించాలన్నారు.రోజుకు కనీసం 7--8 గంటలు నిద్రపోవాలనీ తెలిపారు. సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ మాటాడుతూ, జీవన విధానం లో సానుకూల మార్పులు చేసుకోవాలనీ అన్నారు. వ్యాయామం, నడకను అలవాటు చేసుకోవాలనీ కోరారు. మానసిక ఆరోగ్యానికీ ప్రాధాన్యత ఇవ్వాలనీ తెలుపుతూ అవసరమైన సందర్భంలో మైండ్ కేర్ సెంటర్ ను సంప్రదించాలని కోరారు. హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు అలువల ఈశ్వర్ మాటాడుతూ కార్మికుల ఆరోగ్య పరిరక్షణ సమాజ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించేందుకు కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అలువల ఈశ్వర్, సైకాలజిస్ట్ కె. పున్నం చందర్, అడ్వకేట్ దాసరి తిరుమల, ఆసుపత్రి సిబ్బంది లక్ష్మీరాజం, శ్రీకాంత్ , నర్సులు, సహకార సంఘం అధ్యక్షులు మూషం రాజయ్యా మరియు కార్మికులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల విద్యాలయంలో సైన్స్ టాలెంట్ టెస్ట్

**గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు**



చిగురుమామిడి, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): ఫిబ్రవరి 28న జరిగే జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిగురుమామిడి మండలంలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్‌లోని మోడల్ స్కూల్‌లోను, మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలోను పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఈ పరీక్షను నిర్వహించడం జరిగింది.

ఈ టాలెంట్ టెస్ట్‌లో ప్రతి విద్యాసంస్థ నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన తొలి ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి "శంకర్ నారాయణ డిక్షనరీ"లను బహుమతులుగా ప్రధానం చేశారు. బహుమతులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హర్జిష్ కౌర్, కస్తూర్బా బాలికల విద్యాలయం ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హర్జిష్ కౌర్ మాట్లాడుతూ, సైన్స్ టాలెంట్ టెస్టులు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా, లక్ష్యసాధన దిశగా కృషి చేయాలనే తపనను కలిగిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజం గర్వించే స్థాయికి ఎదగాలని సూచించారు. మధురమ్మ ట్రస్ట్ విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు ఇటువంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందించడం, టాలెంట్ టెస్టులు నిర్వహించి ప్రతిభావంతులను ప్రోత్సహించడం, మండల స్థాయిలో స్కూల్ టాపర్లకు సత్కారాలు నిర్వహించడం వంటి సేవలు ట్రస్ట్ అందిస్తున్నదని పేర్కొన్నారు. ఈ సేవలు విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సైన్స్ దినోత్సవాన్ని ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ చింతనను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రశంసలు అందుకుంది. టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ విద్యార్థులు వి. అనుశ్రీ, ఏ. అశ్వంత్ రెడ్డి, బి. సాత్విక్ రెడ్డి, ఎస్. నవీన్ రెడ్డి, ఈ. స్నేహితలను ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే కస్తూర్బా బాలికల విద్యాలయం నుండి ఎం. అక్షయ, ఎన్. గీతాంజలి, ఎం. రిషిత, ఆర్. సాత్విక, కే. శివానిలు ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
శుక్రవారం 27 ఫిబ్రవరి 2026



## అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

**పదో తరగతి విద్యార్థులు చదవాలి.. రాయాలి**

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ జడ్పీ హైస్కూల్‌లో పనులు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్. పీఎంశ్రీ కింద బొప్పాపూర్ గ్రామంలోని జడ్పీ హై స్కూల్ లో అదనపు తరగతి గదులు, సైన్సు ల్యాబ్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పీఎంశ్రీ కింద బొప్పాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత విద్యాలయంలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, సైన్సు ల్యాబ్ నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులు, కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేశారు. పనుల్లో మరింత వేగం పెంచాలని, రానున్న 20 రోజుల్లో పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రస్తుతం విద్యాలయంలో విద్యార్థులు సంఖ్య, ఎన్ని తరగతి గదులు ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పదో తరగతి విద్యార్థుల క్లాసు రూమ్ కు వెళ్లి వారితో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలకమని తెలిపారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు చదవాలని, సమాధానాలు రాయాలని సూచించారు. ఆ సమాధానాలు మరోసారి సమీక్ష చేసుకొని, ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. బొప్పాపూర్ గ్రామం లో మంద స్వరూప ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటుండగా, కలెక్టర్ పరిశీలించి, లబ్దిదారుతో మాట్లాడారు. నిర్మాణం ఎప్పుడు మొదలు పెట్టారు? రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం అందిందా అని ఆరా తీశారు. మూడు విడుతల్లో కలిపి తనకు మొత్తం రూ. నాలుగు లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని కలెక్టర్ దృష్టికి మంద స్వరూప తీసుకువెళ్లారు. మిగతా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్దిదారుకు కలెక్టర్ సూచించారు. తుది దశ పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.కార్యక్రమాల్లో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, హౌసింగ్ డీఈ ముజఫర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, టీజీఈడబ్ల్యూఐడీసీ డీఈ సత్యనారాయణరావు, ఎంఈఓ, ఏఈలు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

జమ్మికుంట, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" (ూతీతీఱఙవ ూశ్రీఱఙవ) -- సురక్షిత రహదారి ప్రయాణం కార్యక్రమంలో భాగంగా, కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని డ్రైవర్లందరికీ భారీ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున జమ్మికుంటలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో ఈ శిబిరం నిర్వహించబడింది. రహదారి భద్రతలో డ్రైవర్ల కంటి చూపు అత్యంత కీలకమైనదని, ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మరియు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. డ్రైవర్లు తమ ఆరోగ్యంతో పాటు కంటి చూపును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని, స్పష్టమైన చూపు లేకపోవడం వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడమే ఈ శిబిరం ఉద్దేశమని పేర్కొన్నారు. జమ్మికుంట మరియు పరిసర ప్రాంతాల్లోని ఆటో, క్యాబ్, లారీ, బస్సు మరియు ఇతర వాహన డ్రైవర్లందరూ దాదాపు 500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని వారికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి ,జమ్మికుంట ఇన్స్పెక్టర్ రామకృష్ణ , హుజురాబాద్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, వెంకట్ , లక్ష్మీనారాయణ, ఎస్సైలు శేఖర్ రెడ్డి , నాగరాజు , స్వాతి , సతీష్ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సుందరగిరి శివాలయంలో వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట





## విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా లక్ష రూపాయలు అందజేసిన యువకులు

చిగురుమామిడి, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): మండలంలోని సుందరగిరి గ్రామ శివాలయంలో నవగ్రహ, సూర్య భగవాన్, నాగేంద్ర స్వామి, జంట నాగులు, పార్వతి దేవి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల నినాదాల మధ్య భక్తుల హర్షధ్వానాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. అర్చకులు ధనగూరి మఠం విజయ్‌కుమార్ స్వామి, మణికంఠ స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ బాకం ఆంజనేయులు నేతృత్వంలో దీపారాధన, గంగ సేకరణ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, రక్షాబంధనం, పుణ్యహావాచనం, మండపారాధన, కలశ స్థాపన వంటి శాస్త్రోక్త కార్యక్రమాలను భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

శివుడు గ్రహాధిపతి కావడంతో శివాలయంలో నవగ్రహాల ప్రతిష్ట చేయడం ద్వారా గ్రహ దోషాలు, దుష్ప్రభావాలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. ప్రతిష్టాపన సమయంలో వేద పండితుల చేత ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణాన్ని మంగళమయంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా సుందరగిరి గ్రామానికి చెందిన జంగ మధు, నల్లగోని సురేష్ గౌడ్, జంగ భూపాల్ రెడ్డి, గందె రమేష్, పత్తెం వెంకన్న కుటుంబ సభ్యులు ఉమ్మడిగా కలిసి ఆలయ అభివృద్ధి నిమిత్తం లక్ష రూపాయలు అందజేశారు. నవగ్రహాల విగ్రహాలను గంగు కుమార్ సమర్పించగా, జోడా నాగుల విగ్రహాన్ని బాకం వీరేశం అందజేశారు. పార్వతి దేవి, సూర్య భగవాన్ విగ్రహాలను గైని శ్రీకాంత్ అందించగా, ఆలయ కమిటీ వారు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సర్పంచ్ జంగా శిరీష-వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేసిన భక్తులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. భక్తులకు మహా అన్నప్రసాదాన్ని బాకం శారద-వీరేశం, గంగు మౌనిక-కుమార్ ఆధ్వర్యంలో విస్తృతంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిష్ట మహోత్సవాన్ని విజయవంతం చేశారు. ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిండిన ఈ వేడుక గ్రామ ప్రజల్లో భక్తి భావాన్ని మరింత బలపరిచింది.



## రోడ్డు భద్రత నియమాలు పాటించండి కుటుంబాలంతో ఆనందంగా ఉండండి

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**



హుజురాబాద్ ఫిబ్రవరి 26 (వాయుస్ టుడే): వేగం కంటే ప్రాణం మిన్న అని.. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పిలుపునిచ్చారు. గురువారం సింగాపురం పరిధిలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన 'రోడ్డు భద్రత - అవగాహన' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి రోజూ ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు కేవలం ఒక వ్యక్తి మాత్రమే చనిపోవడం లేదని ఆ కుటుంబం మొత్తం వీధిన పడి విషాదంలో మునిగిపోతుందని గుర్తుచేశారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ఇది కేవలం జరిమానాల నుంచి తప్పించుకోవడానికి కాదు, ప్రాణాలను కాపాడుకోవడానికి అని గుర్తించాలన్నారు. జంక్షన్ల వద్ద, రోడ్డు దాటేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, వాహనాల బ్రేక్ కండిషన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి కీలక పత్రాలను కలిగి ఉండాలని చెప్పారు. సుదీర్ఘ ప్రయాణాలు (లాంగ్ డ్రైవ్స్) చేసే సమయంలో అలసట వల్ల ప్రమాదాలు జరుగుతుంటాయని, కనీసం ప్రతి రెండు గంటలకోసారి వాహనాన్ని నిలిపి విశ్రాంతి తీసుకోవడం శ్రేయస్కరం అని సూచించారు. ఆల్కహాల్ సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల విచక్షణ కోల్పోయి ఘోర ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. వేగం ఎప్పుడూ ప్రాణాంతకమేనని గ్రహించాలని పేర్కొన్నారు. "మీ ఇంట్లో మీపై ఆధారపడి తల్లిదండ్రులు, పిల్లలు ఉంటారు. మీ అజాగ్రత్త వారి భవిష్యత్తును అంధకారం చేస్తుంది. జీవితం చాలా విలువైనది, దానిని రోడ్డు ప్రమాదాల్లో బలి చేయకండి"అని పోలీస్ కమిషనర్ అన్నారు.

## జాతీయ ఫెన్సింగ్ క్రీడా శిక్షకుడిగా శిక్షణ పొందిన గోగులమూడి విజయ్



కృష్ణా జిల్లా-గన్నవరం: పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలా నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత జాతీయ క్రీడా ప్రాధికార సంస్థలో జాతీయ ఫెన్సింగ్ శిక్షకుడిగా శిక్షణ పూర్తి చేసిన కోచ్ విజయ్ గోగులమూడి. కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన్న అవుటపల్లి గ్రామానికి ప్రముఖ వ్యాయామ ఉపాధ్యాయులు , ఏకత్వా పాఠశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి ?విజయ్ గోగులమూడి భారత జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ (ూూ×) ఆధ్వర్యంలో గత ఆరు వారాలుగా జరిగిన ఈ శిక్షణా కాలంలో ఆయన ఫెన్సింగ్ క్రీడకు సంబంధించిన ఆధునిక మెళకువలు, ఉత్తమ శిక్షణ పద్ధతులపై అవగాహన సాధించారు. దేశంలోనే కీలకమైన క్రీడా శిక్షణ కేంద్రం నుండి ఈ గుర్తింపు పొందడం ద్వారా, విజయ్ ఇకపై స్థానిక క్రీడాకారులకు జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణను అందించనున్నారని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి నాగరాజు తెలిపారు. ?ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ పాటియాలాలోని జాతీయ సంస్థలో శిక్షణ పొందడం ద్వారా ఖడ్గ యుద్ధ క్రీడలో ఉత్తమ మెళుకువలు కీలక శిక్షణ అంశాలు నేర్చుకున్నానని, ఇక్కడ అభ్యసించిన క్రీడా అంశాలు ఉపయోగించి గ్రామీణ ప్రాంత క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడమే నా లక్ష్యం అని తెలిపారు. విజయ్ ఈ శిక్షణ పూర్తి చేయడం పట్ల ఏకత్వా పాఠశాల యాజమాన్యం అమరనేని మనోజ్, క్రీడా సంఘం నాయకులు, ఆంధ్రప్రదేశ్ ఖోఖో సంఘం మాజీ అధ్యక్షులు టీఎస్ఆర్కే ప్రసాద్, స్థానిక క్రీడాకారులు, క్రీడా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# ప్రజలకు ఆన్లైన్ మోసాలపై విస్తృత అవగాహన కల్పించాలి: జిల్లా ఎస్పీ జానకి

మహబూబ్నగర్ జిల్లా ఫిబ్రవరి 26(వాయిస్ టుడే ): పాలమూరు పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా ఎస్పీ డి.జానకి ఆధ్వర్యంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని సర్కిల్స్, పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల స్థితిగతులు, పెండింగ్ కేసుల పరిష్కారం, దర్యాప్తులో నాణ్యత, నేరాల నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండేలా దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్షపడే విధంగా చట్టపరమైన బలమైన ఆధారాలు సమర్పించాలని సూచించారు. బాధితులకు న్యాయం అందేలా త్వరితగతిన కేసులను పూర్తి చేయాలని ఆదేశించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఆధునిక సాంకేతికతను వినియోగించి నేరాలను చేధించాలని సూచించారు. అన్ని



పోలీస్ స్టేషన్లలో విలేజ్ హిస్టరీ షీట్స్‌ను అప్డేట్ చేయాలని, గ్రామాల వారీగా నేర చరిత్రపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి స్థానిక సమస్యలను తెలుసుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నైట్ బీట్ మరియు పెట్రోలింగ్ విధులను మరింత సమగ్రంగా నిర్వహించాలని, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. దొంగతనాల కేసుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి లాంగ్ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, దొంగిలించిన సొత్తును బాధితులకు తిరిగి అందించాలన్నారు. చట్ట ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని స్పష్టం చేశారు. అంతేకాకుండా సిబ్బంది సమస్యలను సమయానికి పరిష్కరించేందుకు ఎస్ఐలు సరైన విధంగా ఎండార్స్ చేసి ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో విజయవంతంగా పూర్తిచేసినందుకు జిల్లా పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్.బి రత్నం, డీఎస్పీలు, వెంకటేశ్వర్లు, రమణారెడ్డి సీఐలు, అప్పయ్య, అయిజజుద్దీన్, కమలాకర్, రామకృష్ణ, ఆర్ఐలు, కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బి వి ఆర్ ఐ టి కళాశాలలో కొనసాగుతున్న బాజా సే ఇండియా బగ్గీ పోటీలు




నర్సాపూర్ (వాయిస్ టుడే) : నర్సాపూర్ మున్సిపల్ పట్టణ సమీపంలోని బి.వి.ఆర్ ఐటి ఇనిస్ట్యూట్ ఆఫ్ కళాశాలలో మెకానికల్ బాజా సే ఇండియా 2026 మొదటి రోజు స్టాటిక్ డైనమిక్ ఈవెంట్ల పరీక్షల నిర్వహణ టెక్నికల్ విషయాలపై విస్తృతస్థాయి పరిశీలనలు జరిగాయి బాజా సే ఇండి జాయింట్ కన్వీనర్ డా.వి. మురళి కృష్ణ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మెదక్ జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ శ్రీ డి.వి.శ్రీనివాసరావు అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్,మెదక్ జిల్లా ఎస్.మహేందర్ పాల్గొని బాజా సే ఇండియా పోటీలను జెండా ఊపి బ్రేక్ టెస్ట్ టెక్నికల్ ఇన్‌స్పెక్షన్ స్టాటిక్ ఈవెంట్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బివిఆర్ ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఇటువంటి పోటీలను నిర్వహించటం అభినందనీయమనివిద్యార్థులను ఉత్సహపరిచారు. ఇటువంటి పోటీలు మెదక్ జిల్లాలో జరగటం అభినందనీయమని కొనియాడారు.ఇటువంటి పోటీలు విద్యార్థుల బవిష్యత్తుకు దిశానిర్దేశం ఉద్యోగకల్పన వంటి ఖర్చుతో కూడిన పోటీలు నిర్వహిస్తున్న మేనేజ్మెంట్ గొప్పతన్నాని ప్రసంశించారు. అనంతరం బాజా సే ఇండియా ఆర్గనైజింగ్ కమిటీ వారితో మాట్లాడి వివరాలు నిర్వహణ పద్దతుల గురుంచి తెలుసుకున్నారు.మెకానికల్ బాజా సే ఇండియా 2026 కన్వీనర్ అలీ సయ్యద్ మాట్లాడుతూ ఈ రోజు బాజా సే ఇండియా కార్యక్రమంలో క్రింది ఈవెంట్లు నిర్వహించబడ్డాయని తెలియపరిచారు

ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను,వాహన రూపకల్పన సామర్థ్యాన్ని ప్రాయోగిక ప్రతిభను పరీక్షించే ఉద్దేశంతో విజయవంతంగా నిర్వహించబడిందని. ఆల్-టెరైన్ వెహికల్స్ (ఏటీవీ) రూపకల్పన,తయారీ రేసింగ్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత,సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం సాగుతుందని అన్నారు.ఈ సీజన్‌లో నూతనంగా హోండా జీఎక్స్ 430 ఇంజన్ ను ప్రవేశపెట్టడం జరిగిందని.అధిక పనితీరు ఎక్కువ టార్క్ అందించే ఈ ఇంజిన్ వాహనాల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచనుంధని తెలిపారు. ఈపోటీలకు దిశా నిర్దేశం చేస్తూ వర్క్‌షాప్‌లలో గడిపిన అనుభవం ప్రతి డిజైన్ నిర్ణయం,ప్రతి సాహసోపేత ప్రయత్నం ఇవన్నీ కలసి టార్క్‌ను విజయంగా మలుస్తున్నాయి.ఇది కేవలం ట్రాక్‌పై పోటీ కాదుశభవిష్యత్తు ఇంజినీర్లను,బాధ్యతాయుత నాయకులను తయారు చేసే వేదికగా బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చిరస్మరణీయంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుంచి 10 ప్రతిభావంతమైన జట్లు పోటీలో పాల్గొంటున్నాయని వీరిలో అత్యుత్తమంగా నిలిచే జట్టుకు తెలంగాణ గౌరవ పురస్కారం అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.పోటీ విధానంపై వారు మాట్లాడుతూ.. మొత్తం1000 పాయింట్లకు గాను స్టాటిక్ డైనమిక్ ఈవెంట్లు నిర్వహించబడుతున్నాయని.ఈ పాయింట్ల ఆధారంగా తుది ఓవరాల్ ర్యాంకింగ్ నిర్ణయించబడుతుందని.ఇవే కాకుండా మార్చి 23 బివి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మీట్ నిర్వహించబడుతుందని తెలిపారు.ఇందులో పరిశ్రమ నిపుణులతోపరిచయాలు, ఉద్యోగ అవకాశాలు,స్పాట్ ఆఫర్లు వంటి విలువైన అవకాశాలు.విద్యార్థిని విద్యార్థులకు లభిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రంలో బాల్‌రాజ్ సుబ్రమణ్యం, బాజా సే ఇండియా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, డాక్టర్ కె.సి ఓరా, అడ్వైసర్,బాజా సే ఇండియా, శ్రీలలితా పాత్ర, ప్రణవ్,జోయెల్ థామోస్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దుబే ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్,బాజా స్టీరింగ్ కమిటీ సభ్యులు. కాంతారావు.సురేష్ కుమార్.డాక్టర్ మల్లికార్జున్.వివిధ రాష్ట్రాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



## వెలుగుమట్ల భూదాన్ బాధితులకు ఎంపీ రవిచంద్ర భోజనాలు

ఖమ్మం జిల్లా ఫిబ్రవరి 26 వాయిస్ టుడే : ఖమ్మం నగర శివారు వెలుగు మట్లలోని భూదాన్ బోర్డ్ భూమిలో ప్రభుత్వం తొలగించిన గుడిసెలు, నిరాశ్రాయులైన బాధితుల పరామర్శ కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఖమ్మం పర్యటనకు విచ్చేశారు. యువనేత కేటీఆర్ కు తమ గోడు వెళ్లబోసుకునేందుకు.. తమకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు వెలుగుమట్లలో నిరాశ్రయులైన బాధితులు తమ గుడిసెల వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కేటీఆర్ పర్యటనలో స్వల్ప ఆలస్యం అవ్వడంతో బాధితులంతా ఆకలి, దప్పికతో అలమటిస్తున్నారు. పరిస్థితిని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అప్పటికప్పుడు సుమారు 600 మంది బాధితులకు భోజనాలు, మంచినీటి సదుపాయం కల్పించారు. సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులు భోజనాలు లేక అలమటిస్తున్న తరుణంలో ఘటనా స్థలిలో భోజనాలు ఏర్పాటు చేసిన ఎంపీ రవిచంద్రకు ఋణపడి ఉంటామని బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## కోహిర్ నూతన మున్సిపల్ పాలకవర్గానికి సన్మానించిన రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్

వాయిస్ టుడే ఝరాసంగం ఫిబ్రవరి26: లజహీరాబాద్ పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్. నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం అశోక్ హసన్ జావిద్ వైస్ చైర్మన్ వారి బృందం ఈ సందర్భంగాలో వారికి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మొహమ్మద్ తన్వీర్ మాట్లాడుతూ కోహిర్ పట్టణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మౌలిక సదుపాయాల కల్పన లోను పట్టణ సుందరీకరణలో నూతన పాలకవర్గం ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ. శ్రీ మాణిక్ ప్రభు పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం




వాయిస్ టుడే ఝరాసంగం ఫిబ్రవరి26 జహిరాబాద్ స్థానిక శ్రీ మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా బాధ్యతలు స్వీకరించి పాఠశాల నిర్వహణను చేపట్టారు. డీఈఓగా ఎం. వైష్ణవి, ఎంఈఓగా డి. పూజ, ప్రిన్సిపాల్‌గా ఎస్. తుల్జారాం తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారు. ఇతర విద్యార్థులు కూడా ఉపాధ్యాయులుగా పాఠాలు బోధిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. వెంకటయ్య బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం కూడా అత్యంత ముఖ్యమని తెలిపారు. జీవితంలో స్పష్టమైన లక్ష్యాలు పెట్టుకుని వాటి సాధన కోసం కృషి చేస్తూ ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మాణిక్యమ్మ, నాగలక్ష్మి, శివశంకర్, నర్సింహులు, అరుణ, స్వరూప, మందాకిని, అనిత, సువర్ణ, సోని, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## నూతనవధూ వరులను అశీర్వ దించిన ఉమ్మడి మెదక్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సునీత హనుమంతరావు పాటిల్

ఝరాసంగం, ఫిబ్రవరి26 (వాయిస్ టుడే): ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచయ్య స్వామి సోదరుని కుమార్తె వివాహ వేడుకలో కాంగ్రెస్ పార్టీ.నాయకులు.పాల్గొన్నారు. ఝరాసంగం మండల కేంద్రంలోని వాసవి కల్యాణ మండపంలో జరిగిన ఈ వివాహ వేడుకకు ఉమ్మడి మెదక్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సునీత హనుమంతరావు పాటిల్ . మాజీ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్, పలు గ్రామాల సర్పంచులు,.శివరాజ్. రవీందర్..అమృత్. మాజీ. సర్పంచ్. వేణుగోపాల్ రెడ్డీ పెద్దలు, స్థానిక నాయకులు డప్పుర్. సంగమేశ్వర్. నర్సిములు హాజరయ్యారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కాగితాలకే పరిమితం

**మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ హాయాంలోనే హుస్నాబాద్ అభివృద్ధి ....**

**ఎవరి ప్రభుత్వంలో అభివృద్ధి జరిగిందో ప్రజలు గమనిస్తున్నారు...**

**బుర్ర శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు హుస్నాబాద్ నియోజకవర్గం**



వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 27 హుస్నాబాద్ ప్రతినిధి: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈరోజు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ లు పెట్టి అభివృద్ధి పేరిట రాజకీయ పబ్బం గడుపుతున్నారు తప్ప హుస్నాబాద్ లో చేసిన అభివృద్ధి పూర్తిగా శూన్యమని గత ప్రభుత్వంలోనే విడుదలైన నిధుల తోటి ఈరోజు హుస్నాబాద్ అభివృద్ధి జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హయాంలో జరిగిన అభివృద్ధి ఎంతో తెలిసి మాట్లాడాలని బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు.గురువారం హుస్నాబాద్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు అన్వర్ పాషా అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధి విషయానికి వస్తే గతంలో మాజీ ఎమ్మెల్యే తీసుకొచ్చిన నిధులతోటే ఈరోజు అభివృద్ధి జరుగుతుందని కానీ కాంగ్రెస్ నాయకులు మేమే ఈ అభివృద్ధి చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు హుస్నాబాద్ పట్టణంలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.గౌరవెల్లి ప్రాజెక్టు విషయానికి వస్తే గత రెండున్నర సంవత్సరాలలో తట్టెడు మట్టి తీసి పని చేయలేదని,దీనికి కాంగ్రెస్ నాయకులు మేమే చేస్తున్నాం చేస్తాం, మాతోనే నియోజకవర్గ అభివృద్ధి అని రాజకీయ పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా అభివృద్ధికి సహకరించడానికి మేము సిద్ధమేనని విమర్శలు ప్రతి విమర్శలు మానుకొని హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు దృష్టి పెట్టాలని అన్నారు.దఅనవసరంగా ప్రెస్ మీట్ లు పెట్టి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య టిఆర్ఎస్ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా కౌన్సిలర్లు గాదపాక రవీందర్ బొల్లి శ్రీనివాస్ సంపత్ బిఆర్ఎస్ నాయకులు పాకాల శ్యాంసుందర్ జగ్జీవన్ రామ్ బోజు రవీందర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పసిబిడ్డను హత్య చేసిన - అగ్రకుల పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**




భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి,26: నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మెర గ్రామంలో 2026 ఫిబ్రవరి 18న జరిగిన మల్లన్న జాతరలో సిలికేశ్వరం గణేష్, తల్లి చంద్రకళ , భార్య మౌనిక, అక్క కీర్తి దైవ దర్శనం కోసం వెళ్లారు. వీరిని కులం పేరుతో దూషించి, దౌర్జన్యం, దాడి చేసి గణేష్ యొక్క 2నెలల పసి బిడ్డను ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులు కులం పేరుతో దూషించి, దౌర్జన్యం, దాడిచేసి మానవమృగాల్లా ప్రవర్తించి, 2 నెలల పసిబిడ్డను హత్య చేశారు. ఈ ఘటన కు బాధ్యులైన వ్యక్తులను, కేసు జాప్యం చేస్తున్న పోలీసుల పై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మహిళలని కూడా చూడకుండా, నానా బూతులు తిట్టి అవమానించారు. ఇదేమిటని సోషల్ మీడియాలో ప్రశ్నించిన గణేష్‌ను మూడున్నర గంటల పాటు పైన పేర్కొన్న పెత్తందారులు ఒక గదిలో నిర్బంధించి చితకబాదారు. తన భర్తను కొట్టొద్దని కాళ్ళమీద పడి మౌనిక బతిమిలాడి వేడుకున్నా, కాళ్లతో తన్నారే కానీ, కనీసం కనికరించలేదు. ఘటన జరిగి 7 రోజులైనప్పటికీ నేరస్తులందరినీ అరెస్టు చేయలేదని అన్నారు. హత్య జరిగితే అటేమ్ టు మర్డర్ కేసు పెట్టడం అన్యాయం అన్నారు. తక్షణమే 9మంది హంతకును అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపి, కఠినంగా శిక్షించాలని కోరారు. హంతకులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎసఐలను సస్పెండ్ చేయాలని కోరారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చూడాలని కోరారు. కుల వివక్ష దాడులు, హత్యలు, అత్యాచారాలను అరికట్టాలనీ కోరారు.

## ఇంటర్మీడియట్ ద్వితీయ భాషా పరీక్ష ప్రశాంతంగా నిర్వహణ

**జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు**

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 26: జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు--మార్చి 2026లో భాగంగా గురువారం నిర్వహించిన ద్వితీయ భాషా (తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, జీఎఫ్‌సీ) థియరీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించబడినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.


జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా సాధారణ విభాగంలో 6,743 మంది, వృత్తి విద్యా విభాగంలో 1,895 మంది విద్యార్థులు కలిపి మొత్తం 8,638 మంది విద్యార్థులకు ఉండగా , అందులో సాధారణ విభాగంలో 6,622 మంది, వృత్తి విద్యా విభాగంలో 1,822 మంది కలిపి మొత్తం 8,444 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు వెల్లడించారు. సాధారణ విభాగంలో 121 మంది, వృత్తి విద్యా విభాగంలో 73 మంది కలిపి మొత్తం 194 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఒక మాల్ప్రాక్టీస్ కేసు భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నమోదు చేయబడినట్లు తెలిపారు .పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు, తదుపరి రోజు పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రత, సీసీ కెమెరా పర్యవేక్షణ, పోలీసు బందోబస్తు, ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు క్రమబద్ధంగా నిర్వహించబడినట్లు తెలిపారు .



## 16వ వార్డ్‌లో తాగునీటి పైప్ లైన్ పనుల ప్రారంభానికి చర్యలు

మక్తల్ నియోజకవర్గం ఫిబ్రవరి 26వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులో మంత్రి వాకిట శ్రీహరి గారి ఆదేశాల మేరకు స్థానికంగా తాగునీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో పైప్ లైన్ వేసేందుకు చర్యలు ఊపందుకోనున్నాయి. ఇందులో భాగంగా 15 లక్షల రూపాయల నగర అభివృద్ధి నిధులతో దాదాపు 900 మీటర్ల మేరకు స్థానిక వార్డులో పైప్ లైన్ లేని ఏరియాలో తాగునీటి పైప్లైన్ వేసేందుకు నిధులు మంజూరయ్యాయని, తాగునీటి పైప్ లైన్ సామాగ్రి సైతం చేరుకుందని, వెంటనే పైప్ లైన్ పనులు ప్రారంభిస్తున్నామని వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని తెలిపారు. వేసవికాలం ప్రారంభం అవుతున్న సందర్భంగా ఎలాంటి తాగునీటి ఇబ్బందులు ఉండకుండా, అందరికీ సౌకర్యం ఉండాలని ఉద్దేశంతో అడిగిన వెంటనే పైప్ లైన్ కేటాయించిన మంత్రి వాకిటి శ్రీహరి గారికి ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ఏఈ నాగ శివ, ఇంజనీర్ సత్యం ,కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్కూరి రవికుమార్, రాం నారాయణ, శాలంబిన్, వల్లంపల్లి రవికుమార్, ఈరన్న, సయ్యద్ సలీం, రంజాన్, నీలి రాము తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై తక్షణమే స్పందించిన అధికారులు



పాల్వంచ ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ఏడవ డివిజన్ జయమ్మ కాలనీ, వనమా కాలనీలో వీధి దీపాల సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం స్థానిక ప్రజలు సమస్యపై తెలపగా స్పందించిన 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చల్లగుండ్ల సుజాత దగ్గరుండి అధికారులను పిలిపించి వీధి దీపాలు లేని స్తంభాలకు కొత్త లైట్లు ఏర్పాటు చేయించారు. సమస్యపై స్పందించినందుకు దన్యవాధాలు తెలిపారు.

## పోలీసులం అని చెప్పి వ్యక్తి దగ్గర బంగారం చోరీ

చేవెళ్ల...ఫిబ్రవరి 26(వాయిస్ టుడే)పోలీసులం అని చెప్పి వ్యక్తి వద్ద బంగారం చోరీ చేసిన ఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంతప్పగూడ గ్రామానికి చెందిన కావలి కుమార్ గ్రామం నుండి శంకరపల్లి కి బ్యాంకు పని మీద తన సొంత స్కూటీ వాహనంపై బయలుదేరాడు. ఫాతేపూర్ బ్రిడ్జి దగ్గరకు రాగానే రామంతాపూర్ వైపు నుండి బైక్ పైన ఇద్దరి వ్యక్తులు వచ్చి బండి ఆపి మేం పోలీసులం అని ఐడి కార్డ్ చూపించి నువ్వు జాగ్రత్తగా ఉండాలి,ఇక్కడ దొంగతనాలు జరుగుతాయని చెప్పి, నీ చేతి కి ఉన్నా ఉంగరాలు తీసి కవర్లో పెట్టి దాచుకో అని చెప్పి తీపించి అతని స్కూటీలోనే ఒక కవర్ లో పెట్టి వెళ్ళిపోయారు..అతను తర్వాత బ్యాంకు చేరాక కవర్లో తీసి చూడగా రెండు రాళ్లు కనపడడంతో మోసపోయానని, గ్రహించి పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్ పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.